Published from Kadapa

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



సాయి నాధుని కి ప్రత్యేక పూజలు

లోపలి పేజీలో

కడప KADAPA | సంపుటి:01 Vol.No.01 | సంచిక:169 Issue No. 169 | శుక్రవారం Friday | మే 16, 2025 16 May 2025 | ఎడిటర్:రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor: Ankireddypalle Ramamohan Reddy | పేజీలు :8 Pages 8 | వెల:రూ 3/- Rs 3\-

published from Vijayawada,Kakinada, Ananthapuramu, Kadapa, Eluru Circulated at AndhraPradesh & Telangana

# రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు

**-కూటమి ప్రభుత్వ పాలసీలతో పెట్టుబడులకు దేశ, విదేశీ సంస్థల ఆసక్తి**

**-సచివాలయంలో సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 6వ SIPB సమావేశం**

**-19 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 33 వేల కోట్ల పెట్టుబడులకు ఆమోదం**

**-ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 35 వేల మందికి ఉద్యోగావకాశాలు**

**-ఇప్పటివరకు 6 ఎస్ఐపీబీల్లో 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు ఆమోదం**

**-వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు**

**-ఒప్పందాలు చేసుకున్న సంస్థల పనుల పురోగతిపై డాష్ బోర్డ్ ద్వారా పర్యవేక్షణ**

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశీ సంస్థల ఆసక్తి చూపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుని వెను వెంటనే ప్రాజెక్టుల స్థాపనకు శ్రీకారం చుడుతున్నాయి. ఇప్పటికే కొన్ని సంస్థలు శంకుస్థాపనలు కూడా నిర్వహించగా... మరి కొన్ని కంపెనీలు పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంపై విశ్వాసం



కోల్పోయిన పారిశ్రామిక వేత్తలను తిరిగి రాష్ట్రానికి రప్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలను ఇస్తున్నాయి. 11 నెలల కాలంలో ఎస్ఐపీబీ ఇప్పటికి 6 సార్లు సమావేశం కాగా, 76 ప్రాజెక్టులకు సంబంధించి రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకా శాలు కలుగనున్నాయి. తాజాగా గురువారం సచివాలయంలో సీఎం చంద్ర బాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 6వ ఎస్ఐపిబి సమావేశంలో 19 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. వీటికి సంబంధించి రూ. 33 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఈ పెట్టుబడుల ద్వారా దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.ప్రాజెక్టుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ : ఈ సందర్భంగా సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... 'రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముందుకు వచ్చి ఒప్పందాలు చేసుకున్న సంస్థలు... ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలి. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం ఫాలోఅప్ చేయాలి. ఆయా సంస్థల పెట్టుబడులు, క్షేత్ర స్థాయి పనుల స్థితిగతులను తెలుసుకునేందుకు డాష్ బోర్డ్ తీసుకురావాలి. తద్వారా ఏ ప్రాజెక్టు ఏ స్థాయిలో ఉంది అనేది తెలుసుకోవచ్చు. పెట్టుబడులతో పాటు వచ్చిన ఉద్యోగాల వివరాలతో పోర్టల్ రావాలి. ఎస్ఐపిబి సమావేశాల్లో కొత్త పెట్టుబడులకు ఆమోదం తెలపడంతో పాటు... ఇప్పటికే ఆమోదం తెలిపి ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రోగ్రెస్ వివరించాలి' అని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. 50 వేల హోటల్ రూములు లక్ష్యం : టూరిజం ప్రాజెక్టుల ఏర్పాటుపై సిఎం చంద్రబాబు మాట్లాడుతూ...'టూరిజం సెక్టార్‌లో హోటళ్లు, రూముల కొరత ఉంది. పెద్దఎత్తున హోటల్ రూమ్‌లు వస్తే పర్యాటకానికి ఊపు వస్తుంది. 50 వేల రూమ్‌లు అందుబాటులోకి తేవాలి అనేది మన ముందున్న లక్ష్యం. హోటల్ రూమ్‌ల ధరలు అందుబాటులో ఉంటే పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో బస చేస్తారు. కారవాన్స్‌కు సంబంధించి పాలసీని కూడా సిద్ధం చేసి అమల్లోకి తేవడం ద్వారా కొత్త పర్యాటకులకు కొత్త అనుభూతి కలుగుతుంది. తద్వారా పర్యాటక ఆదాయం కూడా పెరుగుతుంది. ముఖ్యంగా దేవాలయాలకు వచ్చే వారికి మంచి వసతి అనేది చాలా ముఖ్యం. కుటుంబాలతో వచ్చే వారు ప్రశాంతమైన, పరిశుభ్రమైన వాతావరణంలో ఉండాలి అనుకుంటారు. రాష్ట్రంలో రద్దీగా ఉండే 21 దేవాలయాల్లో వసతి సౌకర్యం పెంచే చర్యలు తీసుకోవాలి. టెంట్లు (గుడారాలు) ఏర్పాటు చేసి వసతి కల్పించే ప్రాజెక్టులను ప్రారంభించాలి. అదే విధంగా గోదావరి, కృష్ణా నదుల వద్ద నిర్వహిస్తున్న హారతుల కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక శోభ పెంచేలా చేపట్టాలి' అని ముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామిక రంగంపై మాట్లాడుతూ... 'వ్యవసాయ వ్యర్థాలను కొన్ని చోట్ల తగలబెడుతున్నారు... దీన్ని నివారించాల్సి ఉంది. చిన్నచిన్న ప్లాంట్ల ద్వారా అగ్రికల్చర్ వేస్ట్‌ను సర్క్యులర్ ఎకానమీగా మార్చాలి. అగ్రికల్చర్ వేస్ట్‌ను సద్వినియోగం చేసుకునే పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలి' అని సిఎం సూచించారు. 6వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన పెట్టుబడుల వివరాలు :6వ ఎస్ఐపీబీ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన మొత్తం 19 సంస్థలకు సంబంధించి రూ. 33,720 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 34,621 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. ఐ అండ్ సి డిపార్ట్‌మెంట్ :1) డెక్కన్ ఫైన్ కెమికల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ : కుమరవరం, అనకాపల్లి జిల్లా - రూ.1,560 కోట్ల పెట్టుబడులు, 1,800 ఉద్యోగాలు2) భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ : పాలసముద్రం, శ్రీ సత్యసాయి జిల్లా - రూ.1,400 కోట్ల పెట్టుబడులు, 800 ఉద్యోగాలు3)

---



# హైదరాబాద్, ముంబైలలో ఈడీ సోదాలు... రూ. 32 కోట్ల ఆస్తుల స్వాధీనం

ముంబై వసాయి విరార్ కార్పొరేషన్ (వీవీఎంసీ) స్కామ్‌పై ఈడీ దర్యాప్తు వేగవంతం

ముంబై, హైదరాబాద్ సహా 13 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు

రూ.9.04 కోట్ల నగదు, రూ.23.25 కోట్ల విలువైన బంగారం, వజ్రాలు స్వాధీనం

మహారాష్ట్ర: ముంబైకి చెందిన వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ (వీవీఎంసీ) పరిధిలో వెలుగుచూసిన భారీ కుంభకోణంపై ఈడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గురువారం అధికారులు కీలక ముందడుగు వేశారు. ముంబై, హైదరాబాద్ నగరాలతో పాటు మొత్తం 13 ప్రాంతాల్లో ఏకకాలంలో విస్తృత సోదాలు నిర్వహించారు.ఈ దాడుల్లో భారీ మొత్తంలో నగదు, బంగారం, వజ్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ ప్రకటించింది. సుమారు రూ.9.04 కోట్ల నగదుతో పాటు, రూ.23.25 కోట్ల విలువ చేసే బంగారం, వజ్రాలు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఆస్తుల మొత్తం విలువ రూ.32 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.ముంబైలోని మిరా భయాందర్ కమిషనరేట్ పరిధిలో ఈ అక్రమాలపై పలు కేసులు నమోదయ్యాయి. వీటి ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను ఆక్రమించి, నిబంధనలకు విరుద్ధంగా 2009 సంవత్సరం నుంచి అక్రమ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు ఈడీ గుర్తించింది.ఈ కుంభకోణంలో సీతారాం, అరుణ్ అనే వ్యక్తులు కీలక నిందితులుగా ఉన్నట్లు ఈడీ పేర్కొంది. కొందరు అవినీతి అధికారులతో వీరు కుమ్మక్కై, ప్రభుత్వ స్థలాల్లో కూడా చట్టవిరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి, అమాయక ప్రజలకు విక్రయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు. ఈ దర్యాప్తులో భాగంగానే వీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగపు డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి నివాసంలో కూడా ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. నిందితుల ఇళ్ల నుంచి పెద్ద ఎత్తున నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ తమ ప్రకటనలో స్పష్టం చేసింది.



# సరస్వతీ పుష్కరస్నానం ఆచరించిన సిఎం రేవంత్

ప్రజాభూమిప్రతినిధి,హైదరాబాద్:-

కాళేశ్వరం వద్ద సరస్వతీ పుష్కరాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరస్వతీ పుష్కరస్నానం ఆచరించారు. గురువారం సాయంత్రం కాళేశ్వరం చేరుకున్న సిఎం రేవంత్.. సరస్వతీ పుష్కర ఘాట్ ను ప్రారంభించారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పుష్కరస్నానం ఆచరించారు. ఆ తర్వాత సరస్వతీదేవి విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదులు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహిస్తోంది. కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో ఇవాల్టి నుంచి ఈనెల 26వ తేదీ వరకు సుమారుగా 12 రోజుల పాటు సరస్వతీ నది పుష్కరాలు జరుగునున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించి, భక్తులు సాంకేతికంగా పొందే సేవలను సైతం అందులో పొందుపరిచారు. సదరు పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చి పుష్కర స్నానం చేయడంతో పాటు పిండప్రదానం, దంపతీ స్నానం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్లను దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు.

# బిజెపి మంత్రికి సుప్రీంకోర్టు షాక్..



2

# మోదీ, నితీశ్... చాతనైతే నన్ను ఆపండి: రాహుల్ గాంధీ



2

ఓం శం శనైశ్చరాయణమః

ఛాయామార్తాండ శనైశ్చరాలయం

ఛాయాపురం, రాయలచెఱువు గ్రామం, రామచంద్రాపురం మండలం, తిరుపతి జిల్లా

16.05.2025 నుండి 18.05.2025 వరకు

జరుగు 4వ వార్షికోత్సవం సందర్భంగా

17.05.2025 శనివారము మ॥ 12.00 గం॥లకు

జరుగు మునివాహన సేవ కొరకు విచ్చేయుచున్న

అందరికి

స్వాగతం - సుస్వాగతం



స్వీకరించు పీఠాధిపతులు

పూజ్యశ్రీ మాతంగానందగిరి స్వామి వారికి

శ్రీ మాతంగ మహాపీఠం, దేవర చెఱువు, లక్కిరెడ్డి పల్లి, అన్నమయ్య జిల్లా.

నిర్వహించు వారు

ఉంగరాల సుబ్రహ్మణ్య శర్మ

వ్యవస్థాపక ధర్మాధికారి

శ్రీ శనైశ్చర స్వామి ఆలయం, ఛాయా పురం, చిట్టత్తూరు క్రాస్, రాయలచెరువు, రామచంద్రాపురం. తిరుపతి జిల్లా.

ఆహ్వానించువారు

శ్రీ బోడిరెడ్డి దామోదర్ రెడ్డి, గారు
సమరసత సేవాఫౌండేషన్, సహ కన్వీనర్, తిరుపతి జిల్లా.

శ్రీ ఎన్. మునిక్రిష్ణమ నాయుడు, గారు
సమరసత సేవాఫౌండేషన్, మండల కన్వీనర్, రామచంద్రాపురం.

శ్రీ మోమిడి లీలాకృష్ణ, అడ్వొకేట్,
సామాజిక సమరసత వేదిక అధ్యక్షులు, తిరుపతి జిల్లా.

శ్రీ యం. హిమాచల్ రెడ్డి, గారు
చిట్టత్తూర్, రామచంద్రాపురం మండలం, తిరుపతి జిల్లా.

శ్రీ పి. సాయిప్రసాద్ (బాబు), గారు
ఎన్.ఆర్. కమ్మపల్లి, రామచంద్రాపురం మండలం తిరుపతి జిల్లా.

ప్రజాభూమి

## సజ్జల భార్గవ్‌రెడ్డికి సుప్రీంకోర్టులో నిరాశ

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత సజ్జల భార్గవ్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు. తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీల నిరోధక చట్టం కేసుకు సంబంధించి మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం తక్షణమే ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. సీనియర్ న్యాయవాది అందుబాటులో లేకపోవడంతో విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.సజ్జల భార్గవ్‌రెడ్డి తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించి మధ్యంతర బెయిల్ కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అయితే, భార్గవ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు అందుబాటులో లేరని, అందువల్ల కేసును వాయిదా వేయాలని ఆయన తరఫు న్యాయవాది ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, సీనియర్ న్యాయవాది వాదనల నిమిత్తం కేసు విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

# సంపాదకీయం

## ఉమ్మడి కుటుంబాల ఊసేదీ..!?

## జాయింట్ ఫ్యామి'లై'!




ఇప్పుడెక్కడి ఉమ్మడి కుటుంబాలుప్రేమానురాగాలు ఇప్పుడుసినిమా సన్నివేశాలు..! తాతలు..నాన్నమ్మలు..మామయ్యలు... అత్తలు..బాబాయిలు..చిన్న ్మ లు.. అక్కలు.. బావలు.. అన్నలు..వదిలు..బావలు..బామ్మర్థులు..ఇంకా దూరపు బంధువులుఆత్మీయులు..స్నేహితులు..ఆపై..ఇరుగు..పొరుగు..ప్రతి ఇల్లు ప్రేమాలయమే..ప్రతి పండుగ బ్రహ్మోత్సవమే..!ఏమైపోయాయి..ఆ ఇళ్లు..కళకళలాడే లోగిళ్ళు..బంధుమిత్రుల సందళ్లు..సంక్రాంతి సంబరాలు..ఉగాది ఉషోదయాలు..దసరా సరదాలు..పెళ్ళిళ్ళు..పేరంటాలు..రోజూ సాగే కోలాటాలు..!mummy..who is this uncle...!ఇది కొన్ని కుటుంబాల్లో సొంత బాబాయికి ఎదురయ్యే చేదు అనుభవంdaddy..how long this old man stays in our home using my wash-room..ఓ తాతకి మనవడి వాత!అమ్మ పుట్టిల్లు మేనమామకుఎరుకా..ఒకనాటి మాట..ఇప్పుడు ఆ మేనమామే ఇరవై వచ్చాక   వేరే వారి వేడుకలో..అప్పుడో హాయ్...ఆ వెంటనే బాయ్..ఇవీ కుటుంబాలు..మైక్రో ఫ్యామిలీలు..ఆ"ధనిక" కవాలీలు.! ఇల్లుల సైజు పెరిగిఆత్మీయతలు కరిగిఅనుబంధాలు తరిగి ఎవరి గదుల్లో వారు..భోజనాలు ఎక్కడి వారికక్కడేకలిసినా అయిదు నిమిషాల్లోకప్పల తక్కెడే..ఇంట్లో ఉన్న నలుగురూ కలిసేదీ గగనమే..ఆ సమయంలో కాలం మందగమనమే..ఎవరి పనుల్లో..ఫోనుల్లో వారు బిజీ..ప్రేమలు గజిబిజీ..!ఒకనాటి పెళ్లిళ్లు ఆనందాల వేదికలు..ఎంత సందడి..నెలల ముందే ఇంట్లో అందరూ ఏర్పాట్లలో..పిలుపులు..ప్రిపరేషన్లు..షాపింగులు..వంటలు..వార్పులుపందిళ్ళు..భాజా భజంత్రీలు..సరదాలు..సాంప్రదాయాలు..ఇచ్చిపుచ్చుకోడాలు..అప్పగింతలు..కుప్పిగంతులు..అవన్నీ ఇప్పుడెక్కడ..రెడీమేడ్ బట్టలు...ఈజీ మేడ్ ఏర్పాట్లు..అప్పటికప్పుడు జరిగిపోయే వివాహాలు..అంతకంటే వేగంగా విడిపోయే బంధాలు..ఉమ్మడి కుటుంబాలు లేకనే ఈ దుర్గతి..విలువలు అధోగతి..!ఒకనాడు కుటుంబమంటేచిన్న ప్రపంచం..కలసి ఉంటే కలదు సుఖం. .మండువా లోగిలి..ఆనందాల కౌగిలి..ఆనాడు చిన్న కంపార్టుమెంట్ఇప్పుడు ఓ బుల్లి అపార్ట్మెంట్ అందులోనూ ఎవరి గదుల్లో వారు బందీ... అప్పుడే జరిగిపోయింది అను బంధాల జమా బందీ..తలరాతలు మారుతున్న కొద్దీ..వృద్ధాశ్రమాల్లో రద్దీ..!జగమంత కుటుంబాలుఅయ్యాయిప్పుడు ప్రేమాభిమానాలకు జాగా లేనిఇరుకు కదంబాలు!! 💐 💐 💐 💐 💐 💐 💐 కుటుంబ దినోత్సవం సందర్భంగా..మళ్లీ ఉమ్మడి కుటుంబాలు రావాలనే అసాధ్యమైన ఆశతో..

**-ఎలిశెట్టి సురేష్ కుమార్**
**9948546286**

# రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు

మొదటిపేజీ తరువాయి

పీయూఆర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ : ఓర్వకల్, కర్నూలు జిల్లా - రూ.1,286 కోట్ల పెట్టుబడులు, 1,200 ఉద్యోగాలు4) బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ : రాంబిల్లి, అనకాపల్లి జిల్లా - రూ.2,300 కోట్ల పెట్టుబడులు, 1,750 ఉద్యోగాలు5) జుపిటర్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ : రాంబిల్లి, అనకాపల్లి జిల్లా - రూ.2,700 కోట్ల పెట్టుబడులు, 2,216 ఉద్యోగాలుటెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్ :6) రాంభద్ర ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ : తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా - రూ.228 కోట్ల పెట్టుబడులు, 250 ఉద్యోగాలు7) మోహన్ స్పింటెక్స్ : మాలవల్లి, కృష్ణా జిల్లా - రూ.482 కోట్ల పెట్టుబడులు, 1,525 ఉద్యోగాలు8) ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ : అచ్యుతాపురం, అనకాపల్లి జిల్లా - రూ.1,779 కోట్ల పెట్టుబడులు, 600 ఉద్యోగాలుఏపీఐఐసీ డిపార్ట్‌మెంట్ :9) వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ : తిరుపతి జిల్లా - రూ.1,061 కోట్ల పెట్టుబడులు, 10,098 ఉద్యోగాలు10) అలీప్ కుప్పం : చిత్తూరు జిల్లా - రూ.5 కోట్ల పెట్టుబడులు, 1,500 ఉద్యోగాలుఎనర్జీ డిపార్ట్‌మెంట్ : 11) నితిన్ సాయి కనస్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ : ఏలూరు జిల్లా - రూ.150 కోట్ల పెట్టుబడులు, 500 ఉద్యోగాలు12) దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు - రూ.2,920 కోట్ల పెట్టుబడులు, 230 ఉద్యోగాలు13) ఆంప్లస్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ : కడప జిల్లా - రూ.3,941 కోట్ల పెట్టుబడులు, 260 ఉద్యోగాలు14) బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు - రూ.9,000 కోట్ల పెట్టుబడులు, 3,900 ఉద్యోగాలుటూరిజం డిపార్ట్‌మెంట్ : 15) బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్ఎల్ పి: తిరుపతి - రూ.150 కోట్ల పెట్టుబడులు, 350 ఉద్యోగాలు16) స్రవంతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ : తిరుపతి - రూ.327 కోట్ల పెట్టుబడులు, 570 ఉద్యోగాలు17)

వరుణ్ హాస్పటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ : విశాఖపట్నం - రూ.899 కోట్ల పెట్టుబడులు, 1,300 ఉద్యోగాలుఐటీ డిపార్ట్‌మెంట్ : 18) డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : శ్రీసిటీ, తిరుపతి జిల్లా - రూ.2,475 కోట్ల పెట్టుబడులు, 5,150 ఉద్యోగాలు19) సెన్సోరెమ్ ఫోటోనిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : కర్నూలు జిల్లా - రూ.1,057 కోట్ల పెట్టుబడులు, 622 ఉద్యోగాలు.

## మోదీ, నితీశ్... చాతనైతే నన్ను ఆపండి: రాహుల్ గాంధీ

బీహార్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, సీఎం నితీశ్ కుమార్ లపై ధ్వజమెత్తారు. దర్భంగాలోని అంబేద్కర్ హాస్టల్‌లో విద్యార్థులతో 'శిక్షా న్యాయ్ సంవాద్' పేరిట తలపెట్టిన ముఖా ముఖి కార్యక్రమానికి వెళుతున్న ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసుల ఆటంకాలను అధిగమించి హాస్టల్ ప్రాంగ ణంలోకి ప్రవేశించిన రాహుల్ గాంధీ, బీహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.దర్భంగాలోని అంబేద్కర్ హాస్టల్ వెలుపల ఈ ఘటన చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ కాన్వాయ్‌ను పోలీసులు హాస్టల్ ప్రాంగణంలోకి ప్రవేశించకుండా నిలువరించారు.

దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయినప్పటికీ, రాహుల్ గాంధీ పట్టువీడకుండా, పోలీసుల అడ్డంకులను దాటుకుని హాస్టల్‌లోకి ప్రవేశించారు. అక్కడ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, బీహార్‌లోని నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని "డబుల్ ఇంజిన్ ధోకాబాజ్ సర్కార్" (డబుల్ ఇంజిన్ మోసపూరిత ప్రభుత్వం) అంటూ తీవ్రస్థాయిలో విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే సామాజిక న్యాయం అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌లను ఉద్దేశించి రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. "నితీశ్ జీ, మోదీ జీ, ఆపగలిగితే ఆపండి. కులగణన తుఫాను సామాజిక న్యాయం, విద్య, ఉపాధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతోంది," అని ఆయన హిందీలో ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పేర్కొన్నారు."బీహార్ పోలీసులు నన్ను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. కానీ వారు నన్ను ఆపలేకపోయారు, ఎందుకంటే మీ (మైనారిటీ వర్గం) శక్తి నన్ను కాపాడుతోంది. దేశంలో కులగణన చేపట్టాలని మేము ప్రధాని మోదీకి చెప్పాం. మీ ఒత్తిడి వల్లే ప్రధాని మోదీ కులగణన ప్రకటించారు. మీ ఒత్తిడికి భయపడి ఆయన రాజ్యాంగాన్ని నుదుటిపై పెట్టుకున్నారు. కానీ వారి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, మైనారిటీలకు వ్యతిరేకమైనది. ఇది అదానీ-అంబానీల ప్రభుత్వం, మీది కాదు," అని రాహుల్ గాంధీ ఆరోపించారు. "భారత్‌లో, బీహా ర్‌లో మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, మీ కు దక్కా ల్సినవన్నీ అమలు చేస్తామని నేను హామీ ఇస్తున్నాను," అని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను ప్రశ్నిస్తూ, "బీహార్‌లోని ఎన్డీయే 'డబుల్ ఇంజిన్ ధోకా బాజ్ సర్కార్' నన్ను అంబేద్కర్ హాస్టల్‌లో దళిత, వెనుకబడిన విద్యార్థులతో సంభా షించకుండా అడ్డుకుం టోంది. విద్యార్థు లతో మాట్లాడడం ఎప్పటి నుంచి నేరంగా మారింది? నితీశ్ జీ, మీరు దేనికి భయపడుతున్నారు? బీహార్‌లో విద్య, సామాజిక న్యాయం పరిస్థితిని దాచిపెట్టాలనుకుంటున్నారా?" అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో నిలదీశారు. "భారతదేశం ప్రజాస్వామ్య దేశం, ఇది రాజ్యాంగం ద్వారా నడు<స్తుంది, నియంతృత్వం ద్వారా కాదు! సామాజిక న్యాయం, విద్య కోసం మా గొంతును వినిపించకుండా ఎవరూ మమ్మల్ని ఆపలేరు," అని ఆయన మరో పోస్ట్‌లో పేర్కొన్నారు.

## బిజెపి మంత్రికి సుప్రీంకోర్టు షాక్..

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ బిజెపి మంత్రి విజయ్ షాకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. ఆపరేషన్ సిందూర్ లో పాల్గొన్న కల్నల్ సోఫియా ఖురేషిని "ఉగ్రవాదుల సోదరి" అని అన్నందుకు తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని మంత్రి విజయ్ షా సుప్రీం కోర్టుకు వెళ్లారు. అయితే, మంత్రికి న్యాయస్థానం ఊహించని షాకిచ్చింది. ఈ సమయంలో జోక్యం చేసుకోలేమంటూ మంత్రి పిటిషన్ ను తిరస్కరించింది.కాగా, పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్, ఆపరేషన్ సిందూర్ నిర్వహించి.. ఉగ్రస్థావరాలపై దాడులు చేసి వాటిని ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్ గురించిన వివరాలు వెల్లడించిన కల్నల్ సోఫియా ఖురేషిపై మంత్రి విజయ్ షా మాట్లాడుతూ.. వాళ్ల సోదరినే పంపి ఉగ్రవాదులకు ప్రధాని మోడీ, తగిన బుద్ధి చెప్పారని వివాదాస్పద కామెంట్స్ చేశారు. దీంతో సర్వత్రా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. మంత్రి వ్యాఖ్యలపై మధ్యప్రదేశ్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ..మంత్రి విజయ్ షాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయనపై ఇండోర్‌లోని మోవ్‌లోని మాన్పూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

## రాష్ట్రంలో చేనేత కార్మికులకు త్వరలోనే ఆరోగ్య బీమా అమలు

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-

రాష్ట్రంలో చేనేత కార్మికులకు శుభవార్త..త్వరలోనే ఆరోగ్య బీమా అమలు ఆంధ్రప్రదేశ్‌లో చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కార్మికులందరికీ త్వరలోనే ఆరోగ్య బీమా అమలు చేయబోతున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వ ఉద్యోగులు వారంలో ఏదైనా ఒక రోజు కచ్చింతగా చేనేత దుస్తులు ధరించాలని ఆదేశాలు జారీ చేయబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులకు మర మగ్గాలకు ఉచిత విద్యుత్ కూడా ఇవ్వబోతున్నట్లు ప్రకటించారు. రాబోయే దసరా నాటికి చేనేత సహకార సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చేనేత రంగం అభివృద్ధి చెందలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేనేత రంగం గాడిలో పడిందని తెలిపారు. అర్హులైన వారికి వర్క్ షెడ్లను కూడా త్వరలో మంజూరు చేస్తామని తెలిపారు. చేనేత ఉత్పత్తులను ఇక నుంచి 20 శాతం పెంచిన ధరలతో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆప్కో చేనేత సంఘాల నుంచి వస్త్రాలు కొనుగోలు చేస్తుందని మంత్రి సవిత పేర్కొన్నారు.

## వీరయ్య చౌదరి కుటుంబానికి మంత్రి లోకేశ్ పరామర్శ

ప్రజాభూమిప్రతినిధి,ఒంగోలు:-


ఒంగోలులో దారుణహత్యకు గురైన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. గురువారం ఉదయం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులోని వీరయ్య చౌదరి నివాసానికి వెళ్లిన మంత్రి లోకేశ్... ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వీరయ్య చౌదరి సతీమణి, కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వీరయ్య చౌదరితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసుకున్నారు. యువగళం పాదయాత్ర సమయంలో తనతో పాటు అడుగులు వేశారని, పార్టీ బలోపేతం కోసం కృషిచేసిన వీరయ్య చౌదరి దారుణహత్య బాధాకరమని అన్నారు. హత్య నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. వీరయ్య చౌదరి కుటుంబానికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవి, ఎమ్మెల్యేలు దామచర్ల



జనార్ధన్, ఉగ్ర నరసింహ రెడ్డి, బిఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## పాకిస్థాన్‌తో చర్చలు కేవలం ఉగ్రవాదంపైనే: కేంద్ర మంత్రి జైశంకర్

పాకిస్థాన్‌తో భవిష్యత్తులో ఎలాంటి చర్చలు జరిగినా అవి కేవలం ఉగ్రవాదానికి సంబంధించిన అంశాలపైనే ఉంటాయని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ గురువారం స్పష్టం చేశారు. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రవాద మౌలిక సదుపాయాలను విజయవంతంగా ధ్వంసం చేశామని, నిర్దేశించుకున్న లక్ష్యాలను భారత్ సాధించిందని ఆయన నొక్కిచెప్పారు.ఢిల్లీలో హోండురాస్ రాయబార కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. "పాకిస్థాన్‌తో చర్చలు ఉగ్రవాదంపైనే ఉంటాయని ప్రధానమంత్రి చాలా స్పష్టంగా చెప్పారని నేను భావిస్తున్నాను. పాకిస్థాన్ అప్పగించాల్సిన ఉగ్రవాదుల జాబితా ఉంది, వారు ఉగ్రవాద మౌలిక సదుపాయాలను మూసివేయాలి. వారికేం చేయాలో తెలుసు. ఉగ్రవాదంపై ఏం చేయాలో వారితో చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నాం. అవే ఆచరణ సాధ్యమైన చర్చలు" అని జైశంకర్ తెలిపారు.



ఏప్రిల్ 22న పహల్గామ్‌లో 26 మంది అమాయక పౌరుల మృతికి కారణమైన దారుణమైన ఉగ్రదాడి తర్వాత భారత్‌కు అంతర్జాతీయంగా విస్తృత మద్దతు లభించిందని ఆయన గుర్తుచేశారు. ఈ దాడికి పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ) అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్‌ఎఫ్) బాధ్యత వహించింది. "చాలా మంది మంత్రులు, నాయకులు ప్రధానమంత్రికి ఫోన్ చేశారు, నాకు కూడా పలువురు మంత్రులు ఫోన్ చేశారు. ఈ దాడికి పాల్పడిన వారిని బాధ్యులను చేయాలని భద్రతా మండలి తీర్మానం స్పష్టంగా పేర్కొంది. మే 7వ తేదీ ఉదయం, ఆపరేషన్ సిందూర్ ద్వారా తీసుకున్న చర్యలతో మేము వారిని బాధ్యులను చేశాం" అని జైశంకర్ వివరించారు.

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలు

అంతకుముందు శ్రీనగర్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, దేశంలో ఎలాంటి ఉగ్రదాడి జరగనంత వరకే ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారత్ గౌరవిస్తుందని స్పష్టం చేశారు.

పాకిస్థాన్ అణుకేంద్రాలను అంతర్జాతీయ పర్యవేక్షక సంస్థ ఆధీనంలోకి తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అభిప్రాయపడ్డారు. శ్రీనగర్‌లోని బాదామీ బాగ్ కంటోన్మెంట్‌లోని ఆర్మీ 15వ కోర్ ప్రధాన కార్యాలయంలో సైనికులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఆపరేషన్ సిందూర్ నిస్సందేహంగా భారత్ చేపట్టిన అతిపెద్ద ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్. వారు మా తలపై దాడి చేయడానికి ప్రయత్నిస్తే, మేము వారి ఛాతీపై దెబ్బకొట్టి పెద్ద గాయం చేశాం" అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

## మళ్ళీ జగన్ ప్రభుత్వంలో శ్రీ యెర్నిమాంబ ఆలయాన్ని విస్తరిస్తాం!

### నీల ధార యాత్రలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్కుమార్



ప్రజాభూమి విశాఖపట్నం

శ్రీ యెర్నిమాంబ అమ్మవారి జాతరోత్సవాల్లో జీవీఎంసీ 41 వ వార్డు జ్ఞానాపురంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, కోడిగుడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన నీలదార యాత్రలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొని అమ్మవారినీ దర్శించుకున్నారు. జ్ఞానపురం నుండి అమ్మవారి ఆలయం వరకు భారీగా స్థానిక మహిళలతో పసుపు నీళ్ల బిందులు పట్టుకొని జరిగిన యాత్రలో వాసుపల్లి పాల్గొని చీర, పసుపు కుంకుమ బుట్టను తలపై పట్టుకుని ఆలయానికి నడిచి వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఆయనతోపాటు వైసీపీ కార్పొరేటర్లు కోడిగుడ్ల పూర్ణిమ, తోట పద్మావతి, కోరుకొండ వెంకట స్వాతి దాస్, రెయ్యి వెంకటరమణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాసుపల్లి గణేష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఎంతగానో కృషి చేశారన్నారు. మళ్ళీ ప్రజల ఆశీస్సులతో రానున్న జగన్ ప్రభుత్వంలో పంటల తల్లి, సంతాన దేవతగా ప్రసిద్ధిగాంచిన ఇక్కడి శ్రీ యెర్నిమాంబ అమ్మవారి ఆలయాన్ని మరింత విస్తరించే విధంగా కృషి చేస్తానని అమ్మవారి పాదాల సాక్షిగా వాసుపల్లి తెలిపారు. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ మాట్లాడుతూ గతంలో ఇక్కడి ఆలయాన్ని తొలగించే ప్రక్రియలో వాసుపల్లి గణేష్ కుమార్ అడ్డుకొని స్థానికంగా అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. మళ్ళీ వైసిపి ప్రభుత్వం లోనే వాసుపల్లి గణేష్ కుమార్ నేతృత్వంలో భక్తులకు సౌకర్యార్థం అన్ని వసతులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధిని అడ్డుకునే కుతంత్ర రాజకీయాలు చేస్తున్నారని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణమే స్థానిక అమ్మవారి ఆలయంలో శాశ్వత షెడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లండ రమణ, 41వ వార్డు వైసిపి నాయకులు వేలంగిని రావు, కుమార్, మురళి, కిషోర్ అప్పారావు, పరీష్, అర్జున్, భవాని, రవి, ప్రసన్న, శ్యామ్ బాబ్జి, ప్రసాద్, గనగళ్ళ, రామరాజు, చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

## నా పై దాడి చేసిన పల్లా శ్రీనివాస్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి

### టిడ్కో ఇల్లు వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలి



### తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్

ప్రజాభూమి విశాఖపట్నం

విశాఖపట్నం : రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన టిడ్కో ఇల్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. లబ్ధిదారులు బ్యాంకు రుణాలకు చెందిన ఈఎంఐ కూడా ప్రభుత్వ చెల్లిస్తుందని అసెంబ్లీ సాక్షిగా బిజెపి ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్ రాజు అడిగిన ప్రశ్నకు ప్రభుత్వ ప్రకటించింది. గురువారం ఆయన జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేసి అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అసెంబ్లీలో ప్రస్తావించినప్పుడు ఈఎంఐ ప్రభుత్వమే కట్టే విధంగా సంబంధించిన మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. నిధులన్నీ అమరావతికి మళ్ళిస్తున్నారని, ముందుగా టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని తాను డిమాండ్ చేస్తున్నా అన్నారు. టిడ్కో ఇళ్ళు ఇచ్చేవరకు తాను పోరాటం కొనసాగిస్తున్నారు. కాంటాక్ట్ లు ఎవరు టిడ్కో ఇల్లు నిర్మాణానికి ముందుకు రావట్లేదు అని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం మొదలు పెట్టింది కాబట్టి దీన్ని ఈ ప్రభుత్వమే పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ నా పై అరాచక శక్తితో దాడి చేయించారని , వందలాది మంది నన్ను హత్య చేసేందుకు వచ్చారని తెలిపారు. ఒక బాధ్యత గల పౌరుడిగా ఏప్రిల్ 24న ఢిల్లీలో సిబిఐకు మరియు కేంద్ర హోంమంత్రికి పల్లా శ్రీనివాస్ చేస్తున్న భూదందాలు కేంద్ర ప్రభుత్వం ఆస్తులు కబ్జాలపై ఒక నివేదిక తయారు చేసి సమర్పించడం అయినది, పల్లా శ్రీనివాస్ తనను హతమార్చడానికి ప్రయత్నం చేస్తున్నారని, హోటల్ సిసి ఫుటేజ్ పరిశీలిస్తే పూర్తి విషయాల బయటపడతాయని చెప్పారు. అదేవిధంగా స్పీకర్ దృష్టికి తీసుకెళ్లినన్నారు. ఈ దాడికి సంబంధించిన వీడియోలు విడుదల చేయాలని, పల్లపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నాను అన్నారు. తాను వ్యక్తిగతంగా పల్లా పై పోరాటం చేస్తున్నానని, ఇది టిడిపి పై పోరాటం కాదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఉన్న బి.వి.రామ్ రాజకీయంగా చనిపోయాడని, ఇక పై నేను ప్రజల తరపున పోరాటం చేస్తానన్నారు. రాజకీయాలను ముందుండి నడిపిస్తానని చెప్పారు.

## ఉపాధి హామీ పథకం శ్రామికుల మధ్యన కొత్తపేట ఎమ్మెల్యేబండారు పుట్టినరోజు వేడుకలు



ప్రజా భూమి కొత్తపేట

కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పుట్టినరోజు వేడుకలను నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు గురువారం ఘనంగా నిర్వహించారు.కాగా కొత్తపేట గ్రామ శివారు చిన్న మెరక గ్రామంలో ఉపాధి శ్రామికుల మధ్యన గుబ్బల మూర్తి బండారు జన్మదిన వేడుకలను నిర్వహించారు.

ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి ఉపాధి శ్రామికులకు తినిపించారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న శ్రామికులు బండారు కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. నిరాడంబరతను కోరుకునే బండారు పుట్టినరోజు వేడుకలకు ఎప్పుడూ దూరంగా ఉంటూ వస్తున్నారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగానే పుట్టినరోజు వేడుకలను ఉపాధి శ్రామికుల మధ్య జరిపామని సీనియర్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి తెలిపారు.ఆయన అందుబాటు లేకపోయినా వేడుకలను పార్టీ శ్రేణులు అభిమానులు ఘనంగా నిర్వహించి తమ అభిమానాన్ని సాటుకుంటున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గుబ్బల సుబ్రహ్మణ్యం, గుబ్బల వెంకటరమణ గుబ్బల వీర్రాజు, యల్లమెల్లి శ్రీను, రాయుడు ఏడుకొండలు. గుబ్బల శ్రీను. గుబ్బల భగవాన్.గుబ్బల ఏడుకొండలు .గుబ్బల నాగరాజు.బొక్కా త్రిమూర్తులు.యనమదల మం గా. గుబ్బల అనంత లక్ష్మి. రాయడు పద్మ తదితరులు పాల్గొన్నారు

## కనువిందు చేసిన మే పుష్పాలు

ప్రజాభూమి, కాకినాడ



కాకినాడ జిల్లా కొత్తపల్లి గ్రామంలో వికసించిన మే పుష్పాలు గురువారం కలువిందు చేస్తున్నాయి. కాకినాడ జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన కాకరపల్లి గంగాధర్ శ్రీనివాసరావు ఇంటి ఆవరణలో మే పుష్పాలు వికసించడంతో అవి చూసేందుకు గ్రామస్తులు ఆసక్తి చూపారు. 19 సంవత్సరాల క్రితం మంచు ప్రదేశాల నుండి తీసుకువచ్చిన దుంపను ఆయన ఇంటి ఆవరణలో వేశారు. అవి ఇప్పుడు 20 మొక్కలుగా పెరిగాయని తెలిపారు. మే నెలలో మాత్రమే పువ్వులు పూయడం ప్రత్యేకత అని, ఏడాదిలో ఒక్కసారి మాత్రమే మే పుష్పం వికసించడం ప్రత్యేకత అని కాకరపల్లి గంగాధర్ రావు తెలిపారు.

## పర్యాటకులకు మధురానుభూతిని కల్పించేలా కొండపల్లి బొమ్మల కేంద్ర అభివృద్ధి...

**కొండపల్లి ఖిల్లా బొమ్మల కేంద్రాలను పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దుదాం...**

**కొండపల్లి బొమ్మల ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి..**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



ప్రజాభుమి ప్రతినిధి,విజయవాడ:

పర్యాటకులకు మధురానుభూతిని కల్పించేలా కొండపల్లి ఖిల్లా, కొండపల్లి బొమ్మల తయారి కేంద్రాలను అభివృద్ధి చేయడంతో పాటు ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సంబంధిత అధికారులకు తెలిపారు.కొండపల్లి బొమ్మల తయారీ కాలనీ వద్ద ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు, కొండపల్లి ఖిల్లా అభివృద్ధి పై గురువారం కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పర్యాటకుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మక కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రం, కొండపల్లి ఖిల్లాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందేందుకు అపార అవకాశాలున్నాయన్నారు. కొండపల్లిలో సుమారు 400 సంవత్సరాలకు పైగా రాజస్థాన్‌కు చెందిన హస్త కళాకారులు అత్యంత కళానైపుణ్యంతో తయారు చేసిన బొమ్మలకు జాతీయ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. కొండపల్లి పరిసర ప్రాంతాలలో లభ్యమయ్యే తెల్ల పొణికి చెక్కతో రూపొందించే కొండపల్లి బొమ్మలకు మరింత ప్రాచుర్యం కల్పించి కళాకారులను ప్రోత్సహించడం ద్వారా జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా శతాబ్దాల చారిత్రక వారసత్వానికి సజీవ సాక్ష్యంగా ఉన్న కొండపల్లి బొమ్మల విశిష్టతను పర్యాటకులకు చాటిచెప్పేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. భవనంలో మౌలిక వసతులను అభివృద్ధి చేసి, సుందరీకరణ పనులు చేపట్టి ఆకర్షణీయంగా తీర్చిదిదేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొండపల్లి బొమ్మ చారిత్రక వైభవం, బొమ్మల తయారీకి ఉపయోగించే తెల్ల పొణికి చెక్క గురించి అత్యంత ప్రాచుర్యం పొందిన బొమ్మల గురించిన విశేషాలను పర్యాటకులకు కళ్లకు కట్టినట్లుగా తెలియజేసి ప్రత్యక్ష అనుభూతి పొందేలా పర్యాటకులకు వివరించేందుకు ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఎంతో దోహదగపడుతుందన్నారు. కొండపల్లి బొమ్మల కాలనీ నుండి ఖిల్లా వరకు ఉన్న మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేసి పర్యాటకులకు అనువుగా తీర్చిదిద్దాలన్నారు. కొండపల్లి వద్ద పర్యాటకులు ట్రెక్కింగ్ నిర్వహించుకునేలా తగ్గిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం ఆథారిటీ ఛీఫ్ మార్కెంటింగ్ ఆఫీసర్ ఎస్. పద్మారాణి, టూరిజం కన్సల్‌టెంట్ సాహితి, జిల్లా పర్యాటక అధికారి ఏ. శిల్ప, ఏపి టూరిజం డవలప్‌మెంట్ కార్పోరేషన్ డిఇ శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దోమల నియంత్రణ ద్వారానే డెంగ్యూ నివారణ సాధ్యం...

**మురుగు నీటినిల్వలను ఆరికట్టి దోమలను నివారిద్దాం...**

**ప్రజల భాగస్వామంతోనే డెంగ్యూ నివారణ సాధ్యం...**

**జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ.**

ప్రజాభుమి ప్రతినిధి, విజయవాడ:



దోమల నియంత్రణ ద్వారానే డెంగ్యూ వ్యాధిని ఆరికట్టగలుగుతామని అధికారులు, ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రాణాంతక డెంగ్యూ వ్యాధి ప్రబల కుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. ఈనెల 16 తేదీ జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డెంగ్యూ వ్యాధి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నగర పాలక సంస్థ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ నుండి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి అనంతరం అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు.

కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దోమల నియంత్రణ ద్వారానే డెంగ్యూ వ్యాధిని ఆరికట్టగలుగు తామన్నారు. దోమల నివారణ పట్ల ప్రజలలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా సంబంధిత అధికారులు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు దోమల ద్వారా సంక్రమిస్తాయని, డెంగ్యూ వ్యాధి ఈడిస్ ఈజిప్ట్ దోమ కాటు ద్వారా సంక్రమిస్తుందని దోమలు వ్యాప్తిచెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోనేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువైన దోమల ద్వారా మలేరియా ఫైలేరియా డెంగీ, చికున్ గున్యా, మెదడు వాపు, వంటి వ్యాధులు వ్యాప్తిస్థాయ న్నారు. నివాస పరిసరాల ప్రాంతాలలో సాధారణంగా ఆనాఫిలస్, క్యూలెక్స్, ఏడిస్, మాన్సోనియా, ఆర్మిజరిస్ దోమలు వ్యాప్తి చెందుతా యన్నారు. డెంగ్యూ వ్యాధిని వ్యాప్తిచేసే ఆడ దోమ ఉదయం, సాయంత్ర వేళల్లో చెమట పట్టే శరీర భాగాలపై కుట్టి రక్తాన్ని పీల్చుకొని నిల్వ ఉన్న నీటి పై గుడ్లను పెట్టి సంతానోత్పత్తి చేసుకొంటాయన్నారు. ప్రజలు ఉదయం సాయంత్రం వేళల్లో కిటికీలను మూసి ఉంచుకోవడం ద్వారా దోమలు ఇంట్లోకి రాకుండా చూసుకోవాలనన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో మాత్రమే డెంగ్యూ దోమలు సంతానోత్పత్తి చేసేందుకు అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఇంటిలో, ఆరుబయట నీటి నిల్వలు లేకుండా పొడిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా డెంగ్యూ వ్యాధిని అరికట్టేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అధిక జ్వరం, తలనొప్పి. కంటి వెనుక భాగంలో నొప్పి, కండరాల నొప్పి, చర్మంపై గుండ్రటి మచ్చలు వంటి లక్షణాలు ఉన్న వారికి వెంటనే డెంగ్యూ పరీక్షలు నిర్వహించాలన్నారు. డెంగ్యూ పరీక్షలను ప్రైవేట్ ఆసుపత్రులలో కాకుండా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గల ప్రత్యేక ల్యాబ్ ద్వారా పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో కాలువలు కొండల కారణం వలన దోమల బెడద ఎక్కువగా ఉంటుందని నగర పాలక సంస్థ, జలవనరుల శాఖ అధికారుల సమన్వయంతో ఎప్పటికప్పుడు కాలువులను శుభ్రపరచి మురుగు నీటి నిల్వలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. యాంటీ లార్వా ఆపరేషన్ ప్రక్రియను ప్రతి సచివాయాలనికి అనుసంధానించాలని అన్నారు. అధికారులు ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులు బాగస్వామ్యంతో నగరాన్ని దోమల రహిత నగరంగా తీర్చిదిద్ధి డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జూన్, జూల్కె మాసాలలో వర్షాలు పడే సమయంలో వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పూల కుండీలు, ఖాళీడబ్బాలు, టైర్లు, ప్లాస్టిక్ సీసాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల నివారణకు అధికారులు తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా మలేరియ అధికారి వి. మోతిబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. యం సుహాసిని, వైద్య ఆరోగ్య శాఖ, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కీర్తిస్తూ 5 వేల మందితో తిరంగా ర్యాలీ...

**ర్యాలీకి ముఖ్య అతిధిగా గౌరవ ముఖ్యమంత్రి హాజరు...**

**భారత్ మాతాకు జై అంటూ మారుమ్రోగేలా ఏర్పాట్లు...**

**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.**

ప్రజాభుమి ప్రతినిధి, విజయవాడ

పహల్గామ్‌లో భారతీయులపై పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడికి ప్రతికారంగా భారత సైన్యం పాకిస్థాన్‌పై చేసిన ఆపరేషన్ సిందూర్ విజయం కావాడాన్ని కీర్తిస్తూ విజయవాడ నగరంలో ఐదు వేల మందితో తిరంగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ర్యాలీకి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిధిగా హాజరుకానున్నారని ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కీర్తిస్తూ 16వ తేదీ శుక్రవారం విజయవాడలో నిర్వహించనున్న తిరంగా ర్యాలీ నిర్వహణపై గురువారం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పహల్గామ్‌లో భారతీయులపై పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడికి ప్రతికారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా 16వ తేదీ సాయంత్రం ఐదు వేల మందితో భారత్ మాతాకు జై అంటూ నగరం మారుమ్రోగేలా తిరంగా ర్యాలీని నిర్వహించడం జరుగుతుందన్నారు. ర్యాలీకి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. 16వ తేదీ సాయంత్రం 5 గంటలకు స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి తిరంగ ర్యాలీ బయలు దేరి బెంజ్‌సర్కిల్‌కు చేరుకుంటుందన్నారు. విద్యార్థిని విద్యార్థులు 500 మీటర్ల జాతీయ పతాకాన్ని చేతబూని ర్యాలీలో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలన్నారు. డిజె సౌండ్ సిస్టమ్ ద్వారా జాతీయ సమైఖ్యత సమగ్రతను చాటే విధంగా జాతీయ గీతాలను వినిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాలీతో పాటు ముఖ్య కూడలి లో తప్పెటగుళ్ళు, గరగర నృత్యాలు, డప్పు వాయిద్యాలు, నృత్య ప్రదర్శనలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాలీలో పాల్గొనే ప్రతి ఒక్కరికి జాతీయ జెండాను అందజేసేలా చూడాలన్నారు. ర్యాలీలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చల్లని త్రాగునీటి సౌకర్యం, తాత్కాలిక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అద్భుత పోరాట పఠిమ చూపిన భారత త్రివిద దళాల సైన్యాధికారులు, సైనికులను కీర్తిస్తూ నిర్వహించే తిరంగా ర్యాలీ విజయవంతం చేసేందుకు నగర పౌరులు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. లక్ష్మీ నరసింహం, ఆర్‌డివో కానూరి చైతన్య, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ పనుల పై నీటి సంఘాల ప్రతినిధులు అవగాహనా కల్గి ఉండాలి....

### మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళజోగేశ్వర రావు

ప్రజా భూమి ప్రతినిధి మండపేట



రాష్ట్రా ప్రభుత్వం నుంచి ఇటీవల మంజూరైనా పనుల పై నీటి సంఘాల అధ్యక్షులు, ఇరిగేషన్ అధికారులతో మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ మండపేట నియోజకవర్గానికి సంబంధించి ఉన్న నీటి సంఘాల వారంతా వారి వారి పరిధిలో జరుగుచున్న ఇరిగేషన్ పనులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అధికారులు ఏ పనులకు ప్రతిపాదనలు పంపుచున్నారు. శాంక్షన్ ఏ పనులకు వచ్చినవి అన్న విషయాలను తప్పకుండా తెలుసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ భాద్యత తీసుకోకపోతే ముఖ్యమైన పనులను ప్రయారిటీలో చేయించుకునే అవకాశం ఉండదన్నారు. నీటి సంఘాల అధ్యక్షులు మండలానికి ఇద్దరు చొప్పున భాద్యత తీసుకుని ఇరిగేషన్ కు సంబంధించిన ప్రతీ విషయాన్ని తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. అనంతరం ఇరిగేషన్ అధికారులు మండపేట నియోజవర్గం నకు శాంక్షన్ అయిన ఇరిగేషన్, డ్రైన్ పనులను నీటీ సంఘాల ప్రతినిధులకు వివరించారు. ఇరిగేషన్ పనులకు సంబంధించి రూ.1.16 కోట్లు, డ్రైన్స్ పనులకు సంబంధించి రూ.1.19 కోట్లు శాంక్షన్ అయినట్లు అధికారులు తెలిపారు. నీటి సంఘాల ఆధ్వర్యంలో వారి వారి పరిధిలోని పనులను త్వరితగతిన పూర్తి చెయ్యాలని ఈ సంధర్భంగా ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, మండపేట మండల అధ్యక్షులు యరగతపు బాబ్జి, నీటి సంఘాల అధ్యక్షులు, ఇరిగేషన్ అధికారులు, తదితర్లు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న బాలరాజు

ప్రజా భూమి, జీలుగుమిల్లి



జీలుగుమిల్లి మండలం రాచ్చన్న గూడెం ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకొన్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనగు రవికుమార్.ఆలయం లో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి 16రోజులు అవ్వగా పండగ వాతావరణం గ మారిన ఆలయ ప్రాంగణం.అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నియోజకవర్గంలో ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో విరాజిల్లాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.16రోజుల పండుగ పరిష్కరించుకొని అమ్మవారి ఆలయంలో అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలలో పాల్గొన్నారు.

# ప్రజలకు దాహార్తిని తీరుస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ప్రజా భూమి, జీలుగుమిల్లి



జీలుగుమిల్లి మండలం, దర్భ గూడెం గ్రామంలో నీటి ఎద్దడి ఉందని తమకు మంచినీరు సరిగ్గా అందడం లేదని ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు గ్రామస్తులు విన్నవించుకున్నారు. గ్రామస్తులు అడిగిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తమ సొంత ఖర్చులతో సుమారు మూడు లక్షల రూపాయలతో మంచినీటి బోరు వేసి గ్రామస్తులు దాహార్తిని తీర్చారు. ఎన్నడూ లేని విధంగా అడిగిన వెంటనే మంచినీటి సమస్యను తీర్చినందుకు ఎమ్మెల్యే పై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# పోరాటం చేస్తున్న సైనికులకు మద్దతుగా నిలవాలి ..

## -డిఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు బాబు

భీమవరం ప్రజా భూమి



భారత్ కొట్టిన దెబ్బకు పాక్ కూసాలు కదిలిపోయాయని, పాక్ కుక్కలా భయపడిపోయిందని, పాక్ ఉగ్రవాదుల దాడులను భారత్ ఎంతో కట్టుదిట్టంగా ఎదుర్కొని విజయం సాధించిందని డిఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు) అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో డిఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద జయహో భారత్ అంటూ నినాదాలు మరణించిన వీర జవాన్లకు సంతాపం తెలిపారు. గాదిరాజు బాబు మాట్లాడుతూ అపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్ కు కేంద్రప్రభుత్వం గట్టిగా బుద్ధి చెప్పిందని, దేశాన్ని అస్థిర పరిచే ఏ శక్తులకైనా ఇటువంటి గుణపాఠం తప్పదని, సరిహద్దులో పోరాటం చేస్తున్న సైనికులకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలన్నారు. అనంతరం వీరజవాన్ మురళి నాయక్ కు నివాళిలర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అంజాన్ కుమార్, చెరుకువాడ రంగసాయి, హెచ్ వోడీలు డా రత్నం, వేణుగోపాల్, రాంకుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

# గోదావరి భగీరధుడు ప్రజల ఆరాధ్యుడు సర్ధర్ కాటన్

భీమవరం : ప్రజాభూమి



గోదావరి భగీరధుడు ప్రజల ఆరాధ్యుడు సర్ధర్ థామస్ కాటన్ అని ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ఉగ్ర నరసింహ, ఏఈ వెంకటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రెస్ట్ హౌస్ రోడ్డులోని కాటన్ విగ్రహం వద్ద సర్ధర్ కాటన్ 222వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. వారు మాట్లాడుతూ ధవళేశ్వరంలో ఆనకట్ట నిర్మించి ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపర భగీరధుడు కాటన్ అని కొనియాడారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, మైలబత్తుల ఐజాక్ బాబు మాట్లాడుతూ తరాలు మారినా గోదారి గుండె చప్పుడు ఆ దొరేనని, భగీరధుని మించిన మహనీయుడు కాటన్ అని అన్నారు. గోదావరి జిల్లా వాసుల గుండెల్లో మాత్రం కాటన్ గుండె చప్పుడులా వినిపిస్తాయని అన్నారు. ప్రతి ఇరిగేషన్, ఇంజనీరింగ్ విభాగాల్లో కాటన్ దొర చిత్రపటాలను పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో కొండ్రు శ్రీనివాస్, విజ్జురోతి రాఘవులు, ఆర్ అప్పాజీ, ఎం గణపతి తదితరులు పాల్గొన్నారు.

# భీమవరం ఆర్టీసీ డిపో పరిధిలోని 17 షాపుల లీజుకు టెండర్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానం

## - డిపో మేనేజర్ పి సత్యనారాయణ మూర్తి

భీమవరం ప్రజాభూమి



భీమవరం ఆర్టీసీ డిపో పరిధిలోని బస్టాండ్ లోని 15 షాపులకు, ఉండి, కాళ్ళలోని 2 షాపులకు లీజుకు ఇచ్చుటకు గాను టెండర్ దరఖాస్తులు కోరుతున్నట్లు భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్ పి సత్యనారాయణ మూర్తి తెలిపారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ఈనెల 22వ తేదీ లోగా ఏలూరులోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకోవాలని, 23న మధ్యాహ్నం 2 గంటలలోపు టెండర్ ఫారములను టెండర్ బాక్స్ లో వేయాలని, మధ్యాహ్నం 3 గంటలకు టెండర్ దారుల సమక్షంలో టెండర్ బాక్స్ లను తీరుస్తారని తెలిపారు. షాపుల వివరాలను పూర్తిగా తెలుసుకుని దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఇంకా ఏదైనా వివరాల కావాలంటే ఆర్టీసీ డిపోలో గల తమ సిబ్బందిని కలిసి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ వై సురేష్ పాల్గొన్నారు.

# ప్రయాణికులకు ఆర్టీసీ మజ్జిగ పంపిణీ

ప్రజాభూమి సామర్లకోట,




బస్సులో ప్రయాణించే ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఆర్టీసీ అధికారులు గురువారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్ లో బస్సుల ప్రయాణించే ప్రయాణికులకు, బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులకు బస్ స్టేషన్ ఇన్చార్జి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కొద్దిరోజులుగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండి ప్రజలు విపరీతమైన ఉక్కపోతకు గురవుతున్న పరిస్థితుల్లో ఆర్టీసీ అధికారులు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రయాణికులు, ప్రజలు అభినందించారు.

# షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాలచట్టం తప్ప మరో మార్గం లేదు

## ఆదివాసి ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు.

ప్రజాభూమి,బుట్టాయగూడెం



ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నెరవేర్చాలంటే షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాలచట్టం తప్ప మరో మార్గం లేదని, వెంటనే గిరిజన సలహా మండలి ఏర్పాటు చేసి ఏజెన్సీ ప్రాంతానికి స్పెషల్ డిఎస్సీ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసి వైస్ చైర్మన్, జిల్లా ఆదివాసి ఐక్య కార్యచరణ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు అన్నారు. కోటరామచంద్రపురంషెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియమాలు చట్టం కొరకు ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఏసి పిలుపుమేరకు కోట రామచంద్రపురం ఐటిడిఏ పరిధిలో మండల కేంద్రం బుట్టాయగూడెంలో గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సేన రాష్ట్ర అధ్యక్షుడు మడకం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 5వ షెడ్యూల్డ్ భూభాగంలో ఆదివాసీలకు విధానపరమైన నిర్ణయాలు గిరిజనసలహా మండలిద్వారానే తీర్మానం చేసుకుంటారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో వెంటనే గిరిజన సలహా మండలి ఏర్పాటు చేసి,రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెగా డిఎస్సీ నోటిఫికేషన్ లో షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాలను స్పెషల్ డిఎస్సీ ద్వారా భర్తీ చేయాలని కోరారు. షెడ్యూల్ ప్రాంత ఉపాధ్యాయ ఉద్యోగాలు మాత్రమే కాకుండా,28 ప్రభుత్వ శాఖల్లో ఉన్న అన్ని ఉద్యోగాలకు రక్షణ కల్పించవలసిన అవసరం ఉందన్నారు. టిఏసి సభ్యులుగా రాజ్యాంగ నిపుణులైన ఆదివాసి మేధావులను గవర్నర్ ,ముఖ్యమంత్రి నియమించాలని కోరారు.టీ డబ్ల్యూ టి యు రాష్ట్ర కార్యదర్శి మొడియం గంగరాజు మాట్లాడుతూ మంత్రి మండలి ఏర్పాటు చేసినట్లే గిరిజన సలహా మండలిని కూడా ఏర్పాటు చేయవలసి ఉన్నప్పటికీ సుమారు సంవత్సరం గడుస్తున్న గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత రైతు కూలి సంఘం, ప్రగతిశీల విద్యార్థి సంఘం, ఆదివాసీ సేన, ఆదివాసి సంక్షేమ పరిషత్, ఆదివాసి విద్యార్థి సంక్షేమ పరిషత్, ఆదివాసీ మహాసభ, కొండరెడ్ల సంఘం, ఏ జెఎసి, ఏ టి ఏ, టి డబ్ల్యూ టి యు, తదితర సంఘాల నాయకులు పలువురు సర్పంచులు హాజరయ్యారు.

# పోలవరం నియోజకవర్గం లో రూ. 60 కోట్లతో అభివృద్ధి పనులు.

## వేపులపాడులో బీటి రోడ్ కి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శంకుస్థాపన

ప్రజాభూమి,బుట్టాయగూడెం.



పోలవరం నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖకు రూ. 27 కోట్లు,ఆర్ అండ్ బి శాఖలో సుమారు రూ.30 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పోలవరం శాసనసభ్యుడు చిర్రి బాలరాజు తెలిపారు. మండలంలోని వేపులపాడులో గురువారం బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బాలరాజు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవి కుమార్ సంయుక్తంగా శంకుస్థాపన చేశారు. మొదటగా రోడ్డు నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే స్వయంగా జెసిబి ని నడిపి రహదారి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని సుందరీకరణ చేయడమే తన లక్ష్యం అన్నారు. ఏజెన్సీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో ముందడుగు వేస్తున్నట్లు అన్నారు. పంచాయతీరాజ్ శాఖ, ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గం లోని ప్రతి పల్లెలో సిసి రోడ్లు నిర్మాణం పూర్తి చేసుకుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు మంచినీటి సమస్య రోడ్ల సమస్య పూర్తి స్థాయిలో పరిష్కరిస్తున్నామని, గడిచిన సంవత్సర కాలంలో ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రతి కుటుంబంలో అందు తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం కంటే ఎన్డీఏ ప్రభుత్వం మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తోందని, ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గానికి కోట్ల రూపాయలు నిధులు తీసుకురావడం సంతోషకరమైన విషయమని అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ కి ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేకమైన శ్రద్ధ ఉందన్నారు. రానున్న సంవత్సరకాలంలో పూర్తిస్థాయిలో సిసి రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ, పక్కా గృహాలు ప్రతి గ్రామంలో పూర్తిచేసే విధంగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే అన్నారు. పేద ప్రజల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అన్ని వర్గాల వారికి అందించే విధంగా ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే చిర్రి అన్నారు. ఈ కార్యక్రమంలో బుట్టాయిగూడెం మండల జనసేన పార్టీ ప్రెసిడెంట్ మెట్ట బుచ్చిరాజు, వేపులపాడు గ్రామ పార్టీ ప్రెసిడెంట్ చోడెం వీరస్వామి, నాయకులు జివిఎన్ నాయుడు, సరిపెల్లి సత్యనారాయణ రాజు, అన్ని శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# "కోట' ఇంటర్ కాలేజ్‌ను సందర్శించిన ఆర్ఐవో యోహాన్



- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- అడ్మిషన్ల కోరుతూ యోహాన్‌ను కలిసిన పలువురు విద్యార్థులు
- మేనేజ్‌మెంట్ ఆదేశాలతో క్యాంపెయిన్‌కు రెడీ అంటోన్న సిబ్బంది.

"ప్రజాభూమి వార్తకు స్పందన "

ప్రజా భూమి ప్రతినిధి, కామవరపుకోట

మండల కేంద్రమైన కామవరపుకోటలో ఉన్న శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలను ఆర్ఐవో యోహాన్ గురువారం సాయంత్రం సందర్శించారు. కాలేజ్‌లో 2025- 26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందా ? లేదా అన్నది పరిశీలించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు తాను ఇక్కడకు వచ్చినట్టు ఆయన తెలిపారు. కళాశాలలో అడ్మిషన్లు నిర్వహించడం లేదన్న వార్తలతో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ కాలేజ్‌ను సందర్శించి ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు తీసుకుని.. కాలేజ్‌ను కొనసాగించాలన్నారు. ఈ క్రమంలోనే కాలేజ్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయా ? లేదా ? అని పరిశీలించేందుకు అధికార యంత్రాంగం కదిలింది. ఈ క్రమంలోనే కొందరు విద్యార్థులు తాము ఇక్కడ ప్రవేశాల కోసం వచ్చినట్టు యోహాన్‌కు తెలపగా ఆయన ఆ విద్యార్థుల వివరాలు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఆ విద్యార్థులకు 535, 460 మార్కులు రాగా ఆ విద్యార్థులను అభినందించారు. ఇక కళాశాల ప్రిన్సిపాల్ గురు వారం అందుబాటులో లేక పోవడంతో కళాశాల సిబ్బంది నుంచి పలు వివరాలు తీసుకున్నారు. కొందరు విద్యార్థులు అడ్మిషన్ల కోసం రాగా.. ఈ రోజు కంప్యూటర్ మొరాయించడంతో మళ్లీ రావాలని కోరగా.. ఆ తర్వాత వచ్చిన విద్యార్థుల వివరాలు మాత్రం తీసుకున్నట్టు సిబ్బంది తెలిపారు. ఇక గతంలో కాలేజ్‌లో మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం క్యాంపెయిన్ ఉండేది... ఇప్పుడు చేస్తున్నారా ? అని యోహాన్ ప్రశ్నించగా మేనేజ్‌మెంట్ సూచనల మేరకు క్యాంపెయిన్ చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఇక కళాశాలలో ప్రవేశం కోసం వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు కళాశాలలో పనిచేస్తోన్న అధ్యాపకుల నుంచి కూడా యోహాన్ వివరాలు సేకరించారు. కళాశాలలో సకల సౌకర్యాలు ఉన్నాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి నివేదికను తాను కలెక్టర్‌కు ఇస్తానని ఆయన తెలిపారు. ఏదేమైనా 42 ఏళ్లుగా కొనసాగుతూ ఎంతోమంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన ఈ కాలేజ్‌ను కొనసాగించాలని ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# రాజుపేట కాలనీలో మెగా పాఠశాల సంసిద్ధత ఉత్సవ్ కార్యక్రమం

## ప్రీస్కూల్ విద్యపై తల్లిదండ్రులకు అవగాహన.

## రాజుపేట గ్రామంలో మెగా సంసిద్ధత ఉత్సవం పై ర్యాలీ.

ప్రజాభూమి, వి.ఆర్.పురం.



కూనవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ విఆర్ పురం సెక్టార్ పరిధిలోగల రాజుపేట కాలనీ గ్రామంలో మెగా పాఠశాల సంసిద్ధత ఉత్సవ్ కార్యక్రమంని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని రాజపేట పంచాయతీ సర్పంచ్ శారద, జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, కూనవరం ప్రాజెక్టు అధికారిని నాగలక్ష్మి, ఉప సర్పంచ్ రాము, సూపర్వైజర్ నయోమి రాణి, ఐటిసి ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ పవన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిధులు అందరూ ఏర్పాటు చేసిన ఏడు రకాల స్టాల్స్ ను పరిశీలించి పిల్లల యొక్క ప్రగతిని తెలుసుకున్నారు. ఈ రకమైన కార్యక్రమం చాలా బాగుందన్నారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన ఐటీసీ ప్రతం సంస్థ వారికి ఐసిడిఎస్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలందరికీ వారి యొక్క తల్లులకు పిల్లల అభివృద్ధి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ వారి యొక్క పిల్లల ప్రగతి వారు ముందే చూసుకోవడం చాలా ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఇటువంటి కార్యక్రమాలు మేము ఇంటి దగ్గర కూడా చేయిస్తామని చెప్పారు. ఈ మేళాని ఒక పండుగలాగా చేయడం చాలా బాగుందని అన్నారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ ప్రీస్కూల్ విద్య అనేది చాలా అవసరమని దీనికోసం ఐసిడిఎస్ చాలా రకాలైన కార్యక్రమాలు అంగన్వాడి కేంద్రం ద్వారా అందిస్తున్నారని వీటిని అందరు సద్వినియోగ పరుచుకోవాలని తెలిపారు. అనంతరం అందరూ కలిసి గ్రామంలో మెగా సంసిద్ధత ఉత్సవం పై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది జి ఎం ఎస్ కే, పాఠశాల చైర్మన్ నాగేంద్ర, త్రల్లిదండ్రులు, ఆశ కార్యకర్తలు, సెక్టార్ లోనీ అంగన్వాడీలుపాల్గొన్నారు.

# ఆదివాసీ జేఏసి ఆధ్వర్యంలో హక్కుల సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు.

ప్రజాభూమి, వి.ఆర్.పురం.



ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఏసి చింతూరు డివిజన్ ఆధ్వర్యంలో చింతూరు ఐటిడిఏ కార్యాలయం ఎదురుగా గురువారం రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసి, చింతూరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో, ఆదివాసి జేఏసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుంజా అనిల్, చింతూరు డివిజన్ చైర్మెన్ జల్లి నరేష్ నేతృత్వంలో ఈ రిలే నిరాహార దీక్షలను నాయకులు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఐటిడిఎ ల వద్ద నిరావధిక రిలే నిరాహార దీక్షలకు, ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, చింతూరు డివిజన్ కమిటీ చింతూరు ఐటిడిఏ వద్ద రిలే నిరాహార దీక్షలను ఆదివాసి నాయకులు చేపట్టారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తక్షణమే టీ ఏ సి (ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్)ని ఏర్పాటుచేయాలనీ, ఏజెన్సీ ఉద్యోగ నియామకాల చట్టం చేయాలనీ, మెగా డీఎస్సీ లో ఉన్న ఏజెన్సీ పోస్టులను మినహాయించి ప్రత్యేక ఏజెన్సీ డిఎస్సీ ద్వారా స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలనీ, ఏజెన్సీ ప్రాంతంలోని ఉద్యోగాలన్నీ స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలనీ తదితర హక్కుల సాధన కోసం ఈ రిలే నిరాహార దీక్షలను చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏపిఏజెఏసి సెంట్రల్ కమిటీ నాయకులు మడివి నెహ్రూ, ఏ యు ఎస్ పి, రాష్ట్ర నాయకులు పూసం శ్రీను, ఏపీ ఎంహెచ్ ఇఏ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావ్, ఏపిఏయుజెఏసి జిల్లా నాయకులు సోడి నారాయణ, ఏ ఐ ఏ ఇ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కాక రాజు ప్రారంభించగా, కుంజా అనిల్, జల్లి నరేష్, వేటగాని మల్లయ్య, ఉయిక రాంప్రసాద్, బేతి ముత్తయ్య, సరియం రామారావు, పూరి రవి, సున్నం రాజశేఖర్, దారవత్ లావణ్య, బానోత్ రవి, బానోత్ శివ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం గ్రామంలో మురళిరాజు పర్యటన

## విష్ణుని పలకరించిన మురళిరాజు



ప్రజా భూమి ప్రతినిధి ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో చిట్టూరి విష్ణుకి ఇటీవల కాలంలో ఆరోగ్యం బాగోను కారణంగా వారిని పలకరించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్న ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు అండ్ నరసాపురం పార్లమెంటు పరిశీలకులు అండ్ ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు ,పోకనాటి వెంకటేశ్వరరావు వైస్సార్సీపీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

# గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు..

## గణిత శాస్త్ర ఉపాధ్యాయులు సతీష్ బాబు



ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం

ఏలేశ్వరం శాఖ గ్రంథాలయం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఎ.కృష్ణమోహన్ ఆదేశాల మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 18వ రోజు వేసవి విజ్ఞాన తరగతులను తృతీయ శ్రేణి గ్రంథాలయ పాలకుడు కవికొండల సత్యనారాయణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ విజ్ఞాన తరగతులకు ముఖ్య అతిథులుగా సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయులు కన్నూరు సతీష్ బాబు,పేపర్ ఆర్ట్ ఉపాధ్యాయులు మామిడి రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణిత శాస్త్ర ఉపాధ్యాయులు సతీష్ బాబు మాట్లాడుతూ నేడు విద్యా వ్యవస్థలో గణితశాస్త్రం యొక్క ప్రాధాన్యత చాలా ప్రాముఖ్యత ఉందని అన్నారు గణితం లో విద్యార్థులు సులువు పద్ధతులను తెలుసుకోవాలని ఆయన తెలిపారు.అనంతరం ఆర్ట్ ఉపాధ్యాయులు మామిడి రాము మాట్లాడుతూ విద్యార్థులు వేసవి విజ్ఞాన తరగతులను వినియోగించుకోని భవిష్యత్తులో మంచి ప్రావిణ్యత సంపాదించు కోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ లేకపోయినా కొత్త రేషన్ కార్డులు జారీ



ప్రజా భూమి జగ్గంపేట

స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్న విషయం అందరికీ తెలిసిన విషయమే అయితే వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కావాలని ప్రభుత్వ నిబంధన విధించడంతో అందరూ చాలా ఇబ్బంది గురవుతున్నారని దాన్ని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, రాష్ట్రంలో శాసనసభ్యులు కూడా ఈ విషయం వల్ల అందరికీ మ్యారేజ్ సర్టిఫికెట్స్ తీసుకోవడం ఖర్చుతో కూడుకున్న విషయంగా పరిగణించి దీనిని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని అందులో భాగంగా కొత్త కార్డులు తీసుకునేవారు మ్యారేజ్ సర్టిఫికెట్ దరఖాస్తు తో పొందు పరచవలసిన అవసరం లేదని వీఆర్వో సర్టిఫై చేస్తే సరిపోతుందని తెలియజేశారు. ప్రభుత్వం ట్రాన్స్ జెండర్ కూడా కొత్త కార్డులు జారీ చేస్తుందని టిడిపి నేతలు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి రేఖ బుల్లి రాజు, టిడిపి విభిన్న ప్రతిభవంతుల జిల్లా అధ్యక్షులు మండపాక అప్పన్న దొర, జగ్గంపేట టౌన్ తెలుగు యువత అధ్యక్షులు కొండ్రోతు శ్రీను, క్లస్టర్ కో కన్వీనర్ కొల్లు రామకృష్ణ, దాట్ల సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారి సేవలో కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) దంపతులు



ప్రజా భూమి జగ్గంపేట

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) మాధురి రత్న ఆండాళ్ దంపతులు వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారిని దర్శించుకుని స్వామివారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గర్భాలయంలో స్వామివారిని దర్శించుకున్న వారికి రంగనాయకుల మండపంలో వేద పండితులు శేష వస్త్రం కప్పి వేద ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పైన జగ్గంపేట నియోజకవర్గ ప్రజల పైన ఆ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నమని తెలియజేశారు.

# పిడుగు పడి ఇల్లు దగ్ధం

ప్రజాభూమి అమలాపురం

డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అల్లవరం వద్దతూర్పులంక గ్రామంలో గురువారం ఉరుములు మెరుపు లతో కూడిన వర్షానికి పిడుగుపడి ఒక ఇల్లు దగ్ధమయింది. పిడుగుపడినప్పుడు ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాధం తప్పింది పెను ప్రమాదంలో గృహం పూర్తిగా కాలి బూడిదయింది.



# తూనికల్లో తేడ వస్తే కఠిన చర్యలు



ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం

తూనిక కొలతల్లో తేడ వస్తే కఠిన చర్యలు తప్పదని పెద్దాపురం డివిజన్ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు భళ్ళమూడి నారాయణమూర్తి అన్నారు. మెట్రాలజీ వారోత్సవాలలో భాగంగా స్థానిక ధ్యాన మందిరంలో ఏలేశ్వరం మర్చంట్ అసోసియేషన్ గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వ్యాపారులు తుకాలు కొలతలలో పారదర్శకంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. మెట్రాలజీ ఇన్స్పెక్టర్ వి మోహన్ మాట్లాడుతూ వేయింగ్ మిషన్లు ప్రతి ఏడాది రెన్యువల్ చేయించుకోవాలని, ప్యాకింగ్ ప్రోడక్ట్స్ లో తేడా రాకుండా చూసుకోవాలని, తేడా వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం వ్యాపారులు పాల్గొన్నారు.

# అన్నమయ్య కళా క్షేత్రం వారిచే భజన బృందం గురువులకు అవార్డుల ప్రధానం



ప్రజా భూమి ప్రతినిధి ప్రత్తిపాడు

ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం ద్వారక తిరుమలలో అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో భజన బృందం గురువులకు అన్నమయ్య కళాక్షేత్ర పీఠాదిపతి శ్రీ విజయశంకర స్వామి వారి చేతుల మీదుగా అన్నమయ్య అవార్డుల ప్రధానోత్సవం వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అన్నమయ్య కళా పరిషత్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, కాకినాడ జిల్లా అన్నమయ్య కళా పరిషత్ అధ్యక్షులు అన్నమయ్య సానా నూకరాజు నాయుడు,జిల్లా కమిటీ సభ్యులు దాసరి సూర్యనారాయణ,పైలా అప్పలనాయుడు,ఇతర జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్స హించి పేద కుటుంబాల అభివృద్ధి కోసం పనిచేద్దాం

## నెలాఖరు నాటికి 2 వేల మంది ఎస్ హెచ్ జి మహిళల్ని ఆర్థికంగా బలోపేతం చేయడంలో భాగస్వామ్యం కావాలి - జేసి చిన్న రాముడు




ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం

స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక సాధికారిత కై వ్యవసాయ అనుబంధ రంగాల వారీగాకార్యాచరణ ప్రణాళిక రూపొందించామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిఆర్డిఏ, మెప్మా , బ్యాంకర్ల తో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ...ప్రతి ఒక్క కుటుంబం నుంచి ఒక పారిశ్రామిక వేత్త రావాలి అనే ముఖ్యమంత్రి సంకల్ప సాధనలో భాగం గా మే నెలాఖరు నాటికి రెండు వేల మంది స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామిక వేత్తలు గా తీర్చి దిద్దే ప్రక్రియ లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఈ లక్ష్యం సాధనకై బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికే ఆయా శాఖల ఆధ్వర్యంలో యూనిట్స్ స్థాపన కోసం మండల పరిధిలో లక్ష్యాల్ని నిర్దేశించి నట్లు తెలియ చేశారు.

వ్యవసాయం రంగంలో జీవనోపాధికి సంబంధించి వ్యవసాయ పరికరాల కొనుగోలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ప్రోత్సాహం , ప్రాసెసింగ్, బ్రాండింగ్, నిల్వ , మార్కెటింగ్ , విలువ ఆధారిత జోడింపు లను విస్తృత పరచాల్సి ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం, పంట మార్పిడి , డ్రోన్ల ప్రోత్సాహం, మిల్లెట్



ఆధారిత వ్యవస్థాపకత విస్తీర్ణాన్ని పెంచడం పై దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. ఉద్యానవన కార్యకలాపాలు, రక్షిత సాగు,సమగ్ర పంట పద్ధతులు, మార్కెటింగ్, మౌలిక సదుపాయాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు చేయడం, రైతుల లో సాంకేతిక నైపుణ్యాన్ని పెంచడం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కోరారు. పశుసంవర్ధక కార్యక్రమాలలో పాల ఉత్పత్తి పెంపు , స్థిరమైన ఆదాయ వనరుల సృష్టిలో భాగంగా డెయిరీ యూనిట్లు, మినీ డెయిరీలు, పశుగ్రాసం పెంపకం తో పాటు క్షేత్ర స్థాయి నుంచి సరైన శిక్షణ అందించవలసి ఉంటుందన్నారు.

ఆక్వా కల్చర్ ప్రణాళికలు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద యూనిట్లను ప్రోత్సహించడం, మత్స్య సంపద జీవనోపాధి పెంపుకు అవకాశాల నేపథ్యంలో ఎస్ హెచ్ జి . మహిళలకు సాంకేతిక మరియు ఆర్థిక సహాయం అందించాలి అని పేర్కొన్నారు.సెరికల్చర్ , పర్యాటక , చేనేత రంగాలలో మెరుగైన అవకాశాలు కల్పించాలని, అందుకు మద్దతుగా బ్యాంకర్లు విరివిగా రుణాలు అందించడంలో ముందుకు రావాలని సూచించారు.స్వయం సహాయక సంఘాలలో ఉన్న మహిళలు పరిశ్రమలు స్థాపిం చే విధంగా డి ఆర్ డి ఏ, మె ప్మా అధికారులు సమర్థవం తంగా పనిచేయాలని సూచిం చారు. మహిళలను ఎంపిక చేసి బ్యాంకుల్లో రుణాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈనెల ఆఖరికి 2000 మంది పరిశ్రమ స్థాపించే విధంగా రుణాలు మంజూరు చేయా లని బ్యాంకర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎల్ డి ఎం డివి ప్రసాద్, డి ఆర్ డి ఏ పి డి, ఎంవి వి ఎస్ మూర్తి, సిడ్బి నోడల్ అధికారి టి. శ్రీనివాస రావు, మెప్మా ఏవో, కె. శైలజ, పిడి, ఎ. పి ఎంపీ, ఏ. దుర్గేష్, డిపిఎంలు, బి హేమం త్, ఏ. శ్రీనివాసరావు, ఈ. శ్రీనివాస బాబు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఈనెల 19 న కాకినాడ రాక

## కీర్తిశేషులు కొండేపూడి శ్యాంబాబు మాదిగ సంస్మరణ సభ కు వేలాదిగా తరలి రావాల మాదిగ లాయర్ల ఫెడరేషన్ పిలుపు

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఈ నెల 19వ తేదీన కాకినాడ కు వస్తున్నారని మాదిగ లాయర్ల ఫెడరేషన్ నేషనల్ అధికార ప్రతినిధి కొత్తపల్లి ప్రసాద్, ఎం ఎల్ ఎఫ్ కాకినాడ జిల్లా అధ్యక్షులు కిల్లాడి దయానందరాజు, మాజీ పి పి యార్లగడ్డ అశోక్ కుమార్ లు గురువారం తెలిపారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వర్గీకరణ కోసం గత 30 సంవత్సరాల కాలంగా అలుపెరగని పోరాటం చేయడం వల్లన, మాదిగలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోర్టులు ఇచ్చిన తీర్పు ద్వారా మాదిగ, మాదిగ ఉపలాలకు న్యాయం జరిగిందని అన్నారు. వర్గీకరణ కోసం దీర్ఘకాలం ఉద్యమించి అమరులైన కొండేపూడి శ్యాంబాబు గత నెల 18వ తేదీన అకాలమరణం చెందారని అన్నారు. ఆయన సంస్మరణ సభ ఈనెల 19వ తేదీన సోమవారం ఉదయం 10 గంటలకు కాకినాడ కమల్వీర్ సినిమా హాల్ జంక్షన్ వద్ద గోకులం రోడ్డు లో "సంతాప సభ" జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉద్యమాల సూర్యుడు, బడుగు బలహీన వర్గాల నాయకుడు, అణగారిన కులాల ఆశాజ్యోతి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథి హాజరవుతారని తెలిపారు. ఈ సమస్మరణ సభకు ఎమ్మార్పీఎస్ ఉద్యోగ సంఘాల నాయకులు, లాయర్ల సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు,మాదిగ మాదిగ ఉప కులాలు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకులు, కార్యకర్తలు, బంధువులు, స్నేహితులు హాజరై కొండేపూడి శ్యాంబాబు మృతికి ఘనమైన నివాళి అర్పించాలని పిలుపు ఇచ్చారు. కొండేపూడి శ్యాంబాబు సోదరుడు కొండేపూడి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో కొండేపూడి శ్యాంబాబు చురుగ్గా పాల్గొన్నారని అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు అమలాపురం నుంచి రాష్ట్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత గ్రామమైన నారావారిపాలెం వరకు పాదయాత్ర నిర్వహించడంలో తూర్పుగోదావరి జిల్లా నుంచి నాయకత్వం వహించారని గుర్తు చేశారు. అలాగే కృష్ణ మాదిగ పాదయాత్రలో రాజమండ్రిలో అస్వస్థకు గురై వారం రోజులు ఉన్న సమయంలో కృష్ణ మాదిగ వెంట కీర్తి శేష్యులు కొండేపూడి శ్యాంబాబు ఉన్నారని అన్నారు. మాదిగల లేరు అంటూ మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్, రాజమండ్రిలో ఏర్పాటు చేసిన మాల సింహ గర్జనకు ధీటుగా మాదిగలు ఉన్నారంటూ మాదిగల విశ్వరూప మహాసభను ఏర్పాటు చేయడంలో



తూర్పుగోదావరి జిల్లాలో కొండేపూడి శ్యాంబాబు చురికేనా పాత్ర పోషించారని అన్నారు. ఎమ్మార్పీఎస్ ఉత్తర కోస్తా జిల్లాల కన్వీనర్ ముమ్మిడివరం వచ్చిన సుబ్బారావు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి తూర్పుగోదావరి జిల్లాలో నాయకత్వం వహించిన కొండేపూడి శ్యాంబాబు సంస్మరణ సభ విజయవంతం చేసేందుకు మాదిగ లాయర్ల ఫెడరేషన్ ముందుకు రావడం శుభ పరిణామం అని అన్నారు. ఈ సందర్భంగా కార్లు మోటారు సైకిళ్లు తో భారీ ఎత్తున ర్యాలీ జరుగుతుందని అన్నారు. త్వరలోనే ఈ కార్యక్రమానికి సంబంధించిన రూట్ మ్యాప్ విడుదల చేస్తామని అన్నారు. మాదిగ జాతి అభివృద్ధి కోసం ఉద్యమించి అమరుడైన కొండేపూడి శ్యాంబాబు కుటుంబానికి ఆదరణ, ఓదార్పు ఇవ్వడానికి మాదిగ జాతి బిడ్డ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ వస్తున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. ప్రముఖ న్యాయవాది యార్లగడ్డ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన, మాదిగలకు మంచే జరిగిందని పేర్కొన్నారు. వర్గీకరణకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు జీవో తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎం.ఎల్.ఎఫ్ స్టేట్ నాయకులు కొండేపూడి ఉదయ్ కుమార్, ఎంఎల్ఎఫ్ నాయకులు చింతపర్తి రాంబాబు, ఎం.ఎల్.ఎఫ్ పలివెల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు కౌలు రైతు మృతి:పొట్టకూటి కోసం వచ్చి తిరిరాని లోకాలకు



ప్రజాభూమి,కాజులూరు.

గురువారం మధ్యాహ్నం ఉరుములు ,మెరుపులతో కూడిన వర్ష కారణంగా పడిన పిడుగుపాటుకు ఒక కౌలు రైతు మృతి చెందిన సంఘటన గొల్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ మేరకు కాజులూరు మండలం జగన్నాథగిరి గ్రామ రెవెన్యూ పరిధిలో మధ్యాహ్నం అకస్మికంగా ఉరుములో మెరుపులతో కూడిన వర్షనికి ఒక్కసారిగా ఉన్నట్టుండి పడిన పిడుగు పాటుకు మండల కేంద్రమైన కపిలేశ్వపురం గ్రామానికి చెందిన బుకే బాలకృష్ణ ( 35) మృతి చెందాడు. అయితే బాలకృష్ణ రామచంద్రపురం మండలం కాపవరం గ్రామంలో గత కొంత కాలంగా అత్తవారి ఇంటివద్దే ఉంటున్నాడు.ఈనేపథ్యంలో పెనుమల్ల గ్రామానికి చెందిన సలాది రాంబాబుకి చెందిన 18 కుంచాలు భూమి కౌలుకి తీసుకుని సాగు చేసుకుంటున్నాడు .అయితే పంట కోతకు వచ్చిన సందర్భంగా గురువారం పంట కోత యంత్రంతో కోత కోయించేందుకు తన సాగు చేసుకుంటున్న పొలం వద్దకు వెళ్లాడు. అయితే అకస్మాత్తుగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షంరావడంతో వర్షానికి బాలకృష్ణతో పాటు కోత మిషన్ కు సంబంధించిన మరో ఇద్దరు స్థానికంగా గల చెట్టు కింద ఉన్నారు. దీంతో ఆకాశంనుడి భారీ శబ్దాలతో పిడుగులు పడటంతో సమీపంలో పడిన పిడుగుపాటుకు బాలకృష్ణ మృత్యువాత పడ్డాడు. అక్కడే ఉన్న మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. దీంతో విషయం తెలుసుకున్న గొల్లపాలెం ఎస్సై మోహన్ కుమార్ సంఘటనా స్థలాని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు . మృతదేహాన్ని కాకినాడ జిజిహెచ్ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై మోహన్ కుమార్ తెలిపారు.

## పొట్టకూటికోసం వచ్చి తిరిగిరాని లోకాలకు.

కపిలేశ్వపురం మండలం కపిలేశ్వపురం నుండి పట్టుకోడు కోసం వచ్చి అత్తవారి గ్రామమైన కాపవరంలో నివాస ఉంటూ జీవనం కొనసాగుతున్న బాలకృష్ణ పిడుగుపాటుకు మృతి చెంది తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కాపవరంతోపాటు కాపిలేశ్వపురంలో విషాద చాయలు అలుముకున్నాయి. మృతుడు భార్యకు చెందిన బందువులు చాలాకాలం నుండి పెనుమల్ల గ్రామంలో భూములను కౌలుకు తీసుకుని సాగు చేసుకోవడం ఆనవాయితుగా కొనసాగుతున్న తరుణంలో మృతుడు బాలకృష్ణ కూడా కొంత భూమిని రాంబాబు వద్ద కౌలుకు తీసుకుని జీవనం కొనసాగించుకుంటున్నాడు.బాలకృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలిసిన వీరు కన్నీరు మున్నూరుగా తలపిస్తున్న దృశ్యం చూపరులను కంటతడి పెట్టించింది.



## మంత్రి నారా లోకేష్ కు ఘన స్వాగతం పలికిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల

ప్రజాభూమి, అనంతపురము

అనంతపురము జిల్లాలో మూడు రోజుల పర్యటన నిమిత్తం గురువారం మధ్యాహ్నం జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర పాఠశాల విద్య, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ కు గుత్తిలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నారా లోకేష్ కు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు.

## పారా లీగల్ వాలంటీర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

### -అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాభూమి, హిందూపురం టౌన్

చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు పారా లీగల్ వాలంటీర్ల నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ. హిందూపురం ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లో చట్టాలపై అవగాహన కల్పించేందుకు సీనియర్ సిటిజెన్లు, దివ్యాంగులు, హిజ్రాలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదవ తరగతి అందుకు సమానమైన విద్యార్హత కలిగిన ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను హిందూపురం రెండవ అదనపు జిల్లా జడ్జి న్యాయ సముదాయంలో ఉన్న లోక్ అదాలత్ విభాగంలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

## అకాల వర్షాలు, ఈదురు గాలులు వల్ల దెబ్బతిన్న పంటలకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలి

### . ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జములయ్య.



ప్రజాభూమి, పుట్లూరు.

ఆకాలంలో సంభవించిన అకాల వర్షాలు, ఈదురు గాలుల వల్ల దెబ్బతిన్న పంటలకు 24 గంటల్లో నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు నెలలు అయినా ఇంతవరకు ఒక్క పైసా కూడా అందించలేదన్నారు. పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను పరామర్శించడానికి వచ్చిన సందర్భంలో పి.జమలయ్య స్థానికరైతు సంఘం నాయకులతో పుట్లూరు మండలం, కడవకల్లు గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పి.జమలయ్య, వీటి . రామాంజనేయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటలు కోటలు దాడుతున్నాయి తప్ప ఆచరణకు నోచుకోవటం లేదని విమర్శించారు. గత రెండు నెలల నుంచి రాష్ట్రంలో అకాల వర్షాలు, ఈదురుగాలు,వడగండ్ల వాన వల్ల ఆహార పంటలైన వరి, మొక్కజొన్న, 15000ఎకరాల్లో, ఉద్యాన పంటలైన అరటి, మామిడి, దానిమ్మ, చీని ,బొప్పాయి తదితర పంటలు 5వేల ఎకరాల్లో దెబ్బతిన్నాయన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే తీరా చేతికి వచ్చే సమయానికి అకాల వర్షాలు,ఈదురు గాలులు,వడగండ్ల వానల వల్ల పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు.కౌలు ముందే చెల్లించి పంటల సాగుచేసిన కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు.కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు పరిహారం ఇవ్వకపోవడం దారుణమన్నారు. తక్షణమే ఆహార పంటలకు రూ.30వేలు, ఉద్యానవన పంటలకు రూ.75వేలు,వాణిజ్య పంటలకు, లక్ష రూపాయలు చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ లో 51 మండలాలు ,రబీలో 54 మండలాలు కరువు మండలాలుగా ప్రకటించారు. కానీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రైతాంగానికి ఎటువంటి పరిహారం ఇవ్వలేదని పరిహారం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందన్నారు. వర్షాభావ పరిస్థితులు,తెగుళ్లు,అకాల వర్షాలు, ఈదురు గాలులు వల్ల ఈ ఏడాది రైతులు, కౌలురైతులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. ఆరుగాల శ్రమించి వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి పండించిన కొన్ని పంటలకైనా మార్కెట్ లో ధరలు పడిపోవడంతో రైతాంగం అప్పుల భారంతో కొట్టుమిట్టాడుతున్నారని ఈ నేపథ్యంలో పంట రుణాలను మాఫీ చేయాలని కోరారు. పెరిగిన సాగు ఖర్చులు దృష్టిలో పెట్టుకొని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు అందించాలని కోరారు.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధన ప్రకారం 2 లక్షల రూపాయల వరకు ఎటువంటి హామీ లేకుండా కౌలురైతులకు పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. అనంతపురం జిల్లాలో పండించిన ధాన్యాన్ని సేకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని ,దానివల్ల 82 కేజీల బస్తాను రూ.1800లకు అమ్ముకోవలసి ఉండగా కేవలం రూ.1300 నుంచి 1400 రూపాయలకు అమ్ముకొని నష్టపోతున్నారన్నారు. ధాన్యం పండిన ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వ తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరల ప్రకారం సేకరించాలని పి.జమలయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతాంగ ఆత్మహత్యలను నివారించడానికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదిక మీద చర్యలు తీసుకోవాలని, బలవన్మరణానికి పాల్పడిన భాదితరైతు కుటుంబాలకు తక్షణమే ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కోరారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వీ టి రామాంజనేయులు, రైతు సంఘం పుట్లూరు మండలం అధ్యక్షులు ఎన్. గోపాలకృష్ణ, మండల కార్యదర్శి సత్తార్ గోపాల్ యాదవ్,వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్న కులాయప్ప, రైతు సంఘం ఉపాధ్యక్షులు బి.చిన్ని కృష్ణుడు యాదవ్, మండల రైతు సంఘం నాయకులు బి. ఓబుల రెడ్డి, కె.పెద్ద ముని, బి గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షం దాటికి కుప్పకూలిన గోడ, దెబ్బతిన్న ఇల్లు

ప్రజాభూమి, రాప్తాడు

రాప్తాడు మండల కేంద్రంలో గురువారం తెల్లవారుజామున నాలుగు గంటలకు బి.రాముడు అనే వ్యక్తి ఇంటి ఆవరణంలోని కాంపౌండ్ గోడ కుప్పకూలడం జరిగింది. దీనితోపాటు ఈయన ఇంటిలోపల కూడా వర్షం దాటికి అక్కడక్కడ గోడల మధ్యలొ చీలిపోయి బీటలు వారింది. జరిగింది. దీనితో ఆయన ఆవేదన చెందుతూ నాకు తిరిగి ఇదే ఇంటిని కట్టుకోవటానికి ప్రభుత్వం గృహాలకు మంజూరు చేయాలని, అదేవిధంగా నా కుమారులకు కూడా సొంతిల్లు లేదని, వీరికి కూడా ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయాలని కోరారు.



## "అనంత" జిల్లా పర్యటనలో నారా లోకేష్ :ఘన స్వాగతం మూడు రోజుల పర్యటన

### ఈ నెల 17 వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి







ప్రజాభూమి బ్యూరో, అనంతపురము

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ మూడు రోజుల పర్యటన నిమిత్తం అనంతపురం జిల్లాకు చేరుకున్నారు. గురువారం మధ్యాహ్నం 1:20 గంటలకు గుత్తి మండలం బేతాపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు చేరుకున్నారు. మంత్రి నారా లోకేష్ కి ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ, హిందూపురం పార్లమెంట్ సభ్యులు పార్థసారథి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వీ., జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, గుంతకల్ శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు, తదితర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు మంత్రికి ఘన స్వాగతం పలికారు.ఈనెల 17వ తేదీ వరకు మంత్రి జిల్లాలోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.




## స్థానిక సంస్థల అభివృద్ధికి సహకరించండి...

### -16వ ఆర్థిక సంఘం సమావేశంలో హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

స్థానిక సంస్థల అభివృద్ధికి 16 వ ఆర్థిక సంఘం ద్వారా పెద్ద ఎత్తున విధులు మంజూరు చేసి ఆదుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం తిరుపతిలో జరిగిన 16వ ఆర్థిక సంఘం సమావేశంలో సౌమ్య కాంతి గోష్ కు వినతి పత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థానిక సంస్థల అభివృద్ధి, నిధుల కేటాయింపు విషయం కోసం 16వ ఆర్థిక సంఘం సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశం లో పాల్గొన్న మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ 16వ ఆర్థిక సంఘం కు పలు ప్రతిపాదనలు చేశారు.15వ ఆర్థిక సంఘం లో మున్సిపాలిటీలకు కేటాయించిన నిధులలో టైడ్, నాన్ టైడ్ గ్రాంట్లుగా విభజించారని నాన్ టైడ్ గ్రాంట్ లో మున్సిపాలిటీలు అభివృద్ధి కోసం రహదారులు, మురికి కాలువల నిర్మాణానికి ఎటువంటి షరతులు లేకుండా కేవలం అభివృద్ధి పనులకే వాడుకోనేలా మార్పులు చేయాలన్నారు.అనేక మున్సిపాలిటీలలో విద్యుత్ చార్జీలు పెనుభారం గా తయారైందని, ఆదాయంలో ఎక్కువ శాతం విద్యుత్ చార్జీలు చెల్లించడానికి సరిపోతోందని, ప్రభుత్వం విద్యుత్ చార్జీల బకాయిలు ఒకే విధానంలో చెల్లించి స్థానిక సంస్థలకు ఊరట కలిగించాలన్నారు. అలాగే సోలార్ విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జనాభాకు అనుగుణంగా పట్టణాలు విస్తరణ అనుగుణంగా ఆర్థిక సంఘం నిధులు కేటాయింపు శాతం పెద్ద ఎత్తున పెంచాలని, తద్వారా అభివృద్ధి చెందుతున్న కొత్త కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించే అవకాశం స్థానిక సంస్థలకు దక్కుతుందన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టాంప్ డ్యూటీలు సర్ చార్జీలు నేరుగా ఆయా స్థానిక సంస్థల ఖాతాలో జమ చేయడం ద్వారా స్థానిక సంస్థలకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు.అభివృద్ధి పనులలో ప్రభుత్వానికి చెల్లించే 18 శాతం జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలన్నారు. మాస్టర్ ప్లాన్ కు అనుగుణంగా జరిగే రోడ్డు విస్తరణలో ఆర్థిక సంఘం నుంచి పెద్ద ఎత్తున నిధులు మంజూరు పరిశీలన చేయాలన్నారు.సమావేశంలో సిడిఎమ్ఏ సంపత్ కుమార్, కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు, మున్సిపల్ కార్పొరేటర్లు మున్సిపల్ ఛైర్మన్లు పాల్గొన్నారు.

## రాష్ట్ర గవర్నర్ పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వీ.



ప్రజాభూమి బ్యూరో, అనంతపురము

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అనంతపురం జిల్లా పర్యటన కోసం పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వీ. ఆదేశించారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటన సందర్భంగా గురువారం అనంతపురం నగరంలోని ఆర్.అండ్.బి. అతిథి గృహంలో సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 17వ తేదీన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అనంతపురము నగరంలోని జేఎన్టీయూలో నిర్వహించే స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. రాష్ట్ర గవర్నర్ పర్యటనకు సంబంధించి ఆర్.అండ్.బి. అతిథి గృహంలో అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అతిథి గృహం పరిశుభ్రంగా, చూసేందుకు అందంగా ఉండాలని, మెయింటెనెన్స్ బాగుండాలని, సోఫాలు, ఫర్నిచర్, ఏసిలు మరమ్మతులు చేయాలని, నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఆర్డిఓ కేశవ నాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, ఆర్.అండ్.బి డిఈ కాటమయ్య, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, ఏడిఎస్ఓ జగన్ మోహన్ రావు, తహసీల్దార్లు హరికుమార్, బ్రహ్మయ్య, రియాజ్ భాష, ఆర్ఐ సందీప్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- క్రిటికల్ కేర్ యూనిట్ ను త్వరితగతిన పూర్తి చేస్తాం
- ఎఫ్.ఆర్.ఎస్ సమయానుసారం వేయకపోతే చర్యలు తప్పవు
- హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన డి.సి.హెచ్. ఎస్ పాల్ రవికుమార్





ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేస్తున్నామని డి.సి.హెచ్. ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ తెలిపారు. పట్టణంలోని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వార్డులను, ఓపి విభాగాలను, ఫార్మసీ, దయాలసిస్ యూనిట్ ను, నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ భవన సముదాయాన్ని, అలాగే వార్డుల్లో డాక్టర్లు, నర్సులు సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. అదేవిధంగా శిథిలావస్థకు చేరుకున్న మార్చురీను పరిశీలించి వివరాలను సేకరించారు. అనంతరం ఆసుపత్రిలోని సమావేశ మందిరంలో వైద్యులతో సమావేశాన్ని నిర్వహించి వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్యులకు కావాల్సిన పరికరాలను, మెరుగైన వైద్య సేవలు అందించడానికి కావాల్సిన సదుపాయాలను వైద్యుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ భవనం నిర్మాణం చేస్తుండడంతో పలు రకాల సేవలకు ఇబ్బందులు తలెత్తేయన్నారు. మరో ఐదు నెలల్లో ఈ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, తద్వారా మరిన్ని వైద్య సేవలు ప్రజలకు అందించే అవకాశం ఉంటుందన్నారు. ఆసుపత్రిలో లక్ష్యం మేరకు సాధారణ ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సిజేరియన్ చేయాలన్నారు. చిన్న పిల్లలకు ఎలాంటి అసౌకర్యం కల్పించకుండా వైద్యం అందించాలని, వార్డుల్లో ఇన్ పేషంట్ సేవలు పెరగాలన్నారు. ఆస్పత్రిలో అందించే ప్రతి చికిత్సను ఎన్టీఆర్ వైద్య సేవ కింద నమోదు చేయాలన్నారు. ఆస్పత్రి లో ప్రతి ఒక్కరూ వారి షిఫ్టుల సమయం ప్రకారం ఎఫ్.ఆర్. ఎస్ ను ఇన్ అండ్ అవుట్ ను ఆసుపత్రి ఆవరణలోనే వేయ్యాలని సూచించారు. సమయ భావం పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది కొరత తమ దృష్టికి వచ్చిందని, వైద్యులను పరిశీలిచేసేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. అలాగే నెల రోజుల్లో ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేస్తామని తెలియజేశారు. శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది వారి సేవలను విస్తృతం చేయాలని, ఆస్పత్రిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫార్మసీలో అన్ని మందులను అందుబాటులోకి తీసుకు వచ్చామని, ముఖ్యంగా గుండె నొప్పితో బాధపడేవారు ఆసుపత్రిలో స్టేమీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో ఉన్న మార్చురీ శిథిలావస్థకు చేరుకుందని, ఆధునిక మార్చురీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. మార్చురీలో మృతదేహాలను నిల్వ ఉంచడానికి ఫ్రీజర్ బాక్స్ లను సైతం అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. రక్త నిధి కేంద్రంలో అన్ని పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. దయాలసిస్ లో ఏసీలు పనిచేయకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతుండడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో ఏసీలను అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. వైద్యులు సిబ్బంది పనితీరులో మార్పు రావాలని, రోగుల వద్ద డబ్బులు అడగడం, లంచాలు డిమాండ్ చేయడం వంటివి చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని, అలాంటి వారిని ఇంటికి పంపుతామని హెచ్చరించారు.

## పండుగలా జెఎన్టియు స్నాతకోత్సవాన్ని నిర్వహిద్దాం

### వైస్-ఛాన్సలర్ హెచ్.సుదర్శన రావు

ప్రజాభూమి,అనంతపురం

అనంతపురం జెఎన్టియు 14వ స్నాతకోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వాహిద్దామని జెఎన్టియు వైస్ఛాన్సలర్ హెచ్.సుదర్శన రావు తెలియజేశారు. స్నాతకోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై జెఎన్టియు ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలులో యూనివర్సిటీలోని వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ 17వ తేదీన నిర్వహించే స్నాతకోత్సవ వేడుకలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఛాన్సలర్ హెూదాలో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. డాక్టర్ సత్యనారాయణ చావాకు వర్శిటీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాన్పూర్ ఐఐటి రిటైర్డ్ ఆచార్యులు ఎంఆర్.మాధవ్ హాజరవుతారన్నారు. స్నాతకోత్సవం నిర్వహణకు సంబంధించి ఇప్పటికే కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. వారి పరిధిలోని పనులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి స్థాయిలో నిర్వహించాలని తెలియజేశారు. విద్యార్థులు 17వ తేదీ ఉదయం 9.30 గంటలలోపు ఎన్టిఆర్ ఆడిటోరియానికి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య, ఓస్డి టు వీసీ ఎన్.దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు పిఆర్.భానుమూర్తి, ఎస్వి.సత్యనారాయణ, వైశాలి ఘోర్పడే, పి.సుజాత, జి.ప్రశాంతి, పద్మ సువర్ణ, ఆర్.కిరణ్మయి, నాగ ప్రసాద్ నాయుడు, ఎ.సురేష్ బాబు, బి.ఈశ్వర్ రెడ్డి, విబి.చిత్ర, సి.శోభా బిందు, జివి.సుబ్బారెడ్డి, ఎపి.శివ కుమార్, ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, చంద్ర మోహన్ రెడ్డి, కోఆర్డినేటర్స్ డా అరుణ మస్తాని పాల్గొన్నారు.



## రేషన్ కార్డుల మార్పు, చేర్పుల సమస్యను పరిష్కరించండి

ప్రజాభూమి పోరుమామిళ్ల :



ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రేషన్ కార్డుల చేర్పులు, మార్పులు ప్రక్రియను సులభతరం చేసి అన్ని సమస్యలను పరిష్కరించాలని అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, పిసిసి సభ్యులు అన్వర్ పోరుమామిళ్ల తహసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల మార్పులు చేర్పులు మరియు కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను చేపట్టింది. కానీ గత ప్రభుత్వం లో పనిచేసిన వాలంటీర్ల వ్యవస్థ కారణంగానో లేదా సాంకేతిక సమస్య కారణంగానో ఒకరి రేషన్ కార్డులో వ్యక్తులు మరొకరి రేషన్ కార్డుల్లో చేరడం జరిగింది. దీని కారణంగా నేడు ఇతరుల రేషన్ కార్డులో ఉన్న వ్యక్తులు వారి సొంత కార్డులోకి వచ్చేదానికి, చిన్న పిల్లలు అమ్మమ్మ, నాన్నమ్మ కార్డు లో ఉన్నటువంటి వాళ్ళు వారి తల్లిదండ్రుల కార్డులోకి చేర్చే దానికి ఆపసోపాలు పడుతున్నటువంటి సమస్యలు అనేకం ఉన్నాయి. కేవలం చనిపోయిన వాళ్లను మాత్రమే కార్డుల నుంచి తొలగించే విధంగా సాంకేతికత ఉంది కాబట్టి వెంటనే ఈ సమస్యను పరిశీలించి వారి సొంత కార్టుల్లోకి చేరే విధంగా సాంకేతికతను అభివృద్ధి చేయాలని, రేషన్ కార్డుల చేర్పులు మార్పుల ప్రక్రియకు మరింత సమయం పొడిగించాలని కోరుతూ! తాసిల్దార్ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాషా ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండో జాతీయ స్థాయి సెమినార్

ప్రజాభూమి పోరుమామిళ్ల :




ఈ నెల 12 వ తారీకు నుంచి 15 వ తారీకు వరకు విజయనగరం రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు జరుగుతున్న 3 వ జాతీయ తైక్వాండో ఫైట్ టెక్నిక్ సెమినార్ నందు మన పోరుమామిళ్ల తైక్వాండో అకాడమీ క్రీడాకారులు తస్లీమ్, నిఖిల్ ,దినేష్ లు పాల్గొన్నట్లు కడప జిల్లా తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాయబ్ రసూల్ తెలిపారు. ఈ సెమినార్ కు కోచ్ గా ఇరాన్ దేశం నుంచి వరల్డ్ ఛాంపియన్ షిప్ ప్లేయర్ అబ్బాస్ షేకి అనే ఇంటర్నేషనల్ కోచ్ రావడం జరిగింది నాలుగు రోజులు పాటు ఈ శిక్షణా కార్యక్రమం నిర్విరామంగా జరుగుతుంది అని తెలిపారు. ఈ సెమినార్ ఆంధ్ర,తెలంగాణ, మరియు కేరళ రాష్ట్రాల నుండి దాదాపు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నరూ ఈ సెమినార్ కు ముఖ్య అతిథిగా రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నట్లు మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు.

## పాలీ సెట్ లో శ్రీనివాస పాఠశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాభూమి, వేంపల్లె




పాలీ సెట్ లో శ్రీనివాస పాఠశాలకు చెందిన విద్యార్థి అరవింద్ రెడ్డి ప్రతిభ చాటినట్లు అ పాఠశాల కరస్పాండెంట్ కేశవులు తెలిపారు. గురువారం విడుదలైన పాలీ సెట్ ఫలితాల్లో అరవింద్ రెడ్డికి 125 మార్కులకు గాను 109 మార్కులు వచ్చినట్లు కరస్పాండెంట్ కేశవులు తెలిపారు. దీంతో అరవింద్ రెడ్డికి రాష్ట్ర స్థాయిలో 1800 ర్యాంకు వచ్చినట్లు చెప్పారు. ఎలాంటి కోచింగ్ లేకుండా పాలీ సెట్ పరీక్షల్లో అత్యంత ప్రతిభ చాటినట్లు చెప్పారు. పదోతరగతి పరీక్షల్లో కూడ 600 కు 591 మార్కులు సాధించినట్లు చెప్పారు. పాఠశాల శ్రమకు నిలువెత్తు నిదర్శనం అన్నారు. గురువారం పాలీ సెట్ లో మంచి మార్కులు సాధించిన విద్యార్థి అరవింద్ రెడ్డికి కరస్పాండెంట్ కేశవులు అభినందించారు.

## వధూవరులను ఆశీర్వదించిన వైయస్ మనోహర్ రెడ్డి

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల పట్టణం కదిరి రోడ్డు సమీపంలో ఉన్నఎస్వీఎస్సార్ ఫంక్షన్ హాల్ లో వైకాపా మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి సోదరుడు కరుణాకర్ రెడ్డి కుమారుడు శివ సాగర్ రెడ్డి, ధారా రెడ్డి ల వివాహం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకలకు మునిసిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ చిన్నప్ప, మాజీ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, లు పాల్గొని నూతన వధూవరులను దీర్ఘ సుమంగళీభవ అని వారిని దీవించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఇరికిరెడ్డి జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాలీసెట్ లో మెరిసిన స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత కోచింగ్ విద్యార్థులు

ప్రజాభూమి, పులివెందుల



స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో పాలీసెట్ ప్రవే శాలకు పాత రమణప్పసత్రం పాఠశాలలో నిర్వహించిన ఉచిత కోచింగ్ నందు ఉత్తమ ర్యాంకు లు సాధించిన విద్యార్థులకు గురువారం అభినందన కార్యక్రమం లో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం లింగాల మండల విద్యాశాఖ అధికారి రామక్రిష్ణ య్య, జెఎన్ టీయూ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శేష మహేశ్వరమ్మ, సుబ్బారెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, విజయానందన్ రెడ్డి, రామాంజనేయులు, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు మొమ్మెల రాజు ల చేతులమీదుగా జ్ఞాపికలు, బహుమతులు అందజేసి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ పేద విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా వేసవి లో సైతం తమ సొంత పనులు మానుకుని కోచింగ్ ఇచ్చిన ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వైసీపీ నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు రామలక్ష్మణ్ రెడ్డి, వైసీపీ జిల్లా విద్యార్థి విభాగం కోశాధికారి రాఘవేంద్ర రెడ్డి, సేవాసమితి బృందం తదితరులు పాల్గొన్నారు.

## నవ వధువు అనుమానాస్పద మృతి

### వరకట్న వేధింపులా ? హత్య చేశారా ?

ప్రజాభూమి, పులివెందుల



కాళ్ల పారాణి ఆరకముందే నవ వధువు అనుమా నాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన పులివెం దులలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేర కు పట్టణంలోని నగిరిగుట్టకు చెందిన ఫయాజ్ ఫక్రుద్దీన్ అనే యువకుడు గత రెండు నెలల క్రితం హర్షియా బేగం అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే ఫక్రుద్దీన్ తన భార్య హర్సియా బేగం ను కట్నం తీసుకు రాలేదని వేధిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. బుధవారం అర్సియా బేగం ఫ్యాన్ కు ఉరేసుకొని అనుమానా స్పద స్థితిలో మృతి చెందింది. అయితే రాత్రి ఇద్దరి మధ్య ఘర్షణ పడ్డారని భర్త హర్షియా బేగం ను ఏమైనా చేశారా? లేక ఆత్మహత్య చేసుకుందా? పోలీసు విచారణలో తేలనుంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని హర్షియా బేగంను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

## ఒంటిమిట్ట శ్రీ కోదండరాముని దర్శించుకున్న బీజేపీ నేత కొత్తపల్లి గీత దంపతులు

ప్రజా భూమి ఒంటిమిట్ట:



అరకు మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొత్తపల్లి గీత , ఆమె భర్త ప్రముఖ పారిశ్రామికవేత్త రామకోటేశ్వరరావు గురువారం ఉదయం ఒంటిమిట్టలో వెలిసిన ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని భక్తిపూర్వకంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీరికి , సంప్రదాయ పద్ధతుల్లో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, శ్రీ కోదండరాముని ఆశీస్సులు కోరారు. ఆలయ విశిష్టత, చారిత్రక నేపథ్యం, దాని ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను అర్చకులు ఈ సందర్భంగా వివరించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఈమె వెంట బీజేపీ జిల్లాస్థాయి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీరిలో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ యాదవ్, మండల అధ్యక్షుడు భాను ప్రకాష్ రాజు, కత్తి జగదీష్, కత్తి వెంకటరత్నం, వెంకటసుబ్బారెడ్డి, అన్వేష్ కుమార్ యాదవ్, శివ, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. గీత దంపతుల రాక పట్ల అభిమానంతో స్పందించిన కార్యకర్తలు, ప్రజలు ఆలయానికి తరలివచ్చారు.

## రాముని యొక్క విశిష్టతను గురించి తెలియజేసిన శ్రీమాన్ శ్రీరామ చక్రధర్

ప్రజాభూమి పులివెందుల



పులివెందుల పట్టణంలో పార్నపల్లి రోడ్డు రోడ్డు సమీపంలో ఉన్న శ్రీ సరస్వతీ విద్యా మందిరం ఇంగ్లీష్ మీడియం పాఠశాల యందు తవాస్మి అనే సంస్థ వారు అయిన శ్రీమాన్ శ్రీరామ చక్రధర్ శారదా దీప్తి , శ్రీమతి జాహ్నవి వీరందరూ కలిసి పిల్లలకు రామాయణం ఆధారంగా పర్సనాలిటీ డెవలప్మెంట్ క్లాస్ నిర్వహిం చారు. శ్రీమాన్ శ్రీరామ చక్రధర్ మాట్లాడుతూ జీవనవేదం రామాయణం అంటూ రామాయణం లోని ఒక ఘట్టం ఒక పాత్ర మనకు ఎలాంటి సందే శాన్ని ఇస్తుందో సవివరంగా వివరించారు. విద్యార్థు లను ఉద్దేశించి రాముని యొక్క విశిష్ట తను తెలియజేయడం జరిగింది. విద్యార్థులు మంచి నడవడిక ద్వారా ఎటువంటి ఫలితాలను పొందగ లరో తెలియ జేయడం జరిగినది. హనుమంతుడు లంకను దాటడానికి ఎన్ని కష్టాలను అధిరోహించా డో మన జీవితంలో కూడా ఉన్న కష్టాలను అధిరో హించడం ద్వారా మనిషి కూడా గెలుపునుసాధించ గలరు అని చెప్పడం జరిగింది. విద్యార్థులకు ఇలా ఎన్నో ఉదాహరణలతో ప్రొజెక్టర్ ద్వారా సులభ పద్ధతిలో అర్థమయ్యే రీతిలో వివరించడం జరిగి నది . ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డిఇఓ యు. మీనాక్షి, శ్రీ సరస్వ తీ విద్యా మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తవాస్మి సంస్థ వారైనా శ్రీరామ చక్రధర్ బిట్స్ పిలాని లాంటి యూనివర్సిటీలో చదువుకొని సాఫ్ట్వేర్ జాబ్ చేశాడు. చేతినిండా పని చదువుకు తగ్గ కొలువు ఆయన ఏదో అసంతృ ప్తి. ఆ అన్వేషణలోని ఆర్జనకన్నా ఆత్మసంతృప్తి ముఖ్యమనుకొని ఉపాధ్యాయ వృత్తి చేపట్టాడు. రామాయణం పై మక్కువతో పది సంవత్సరాల పైగా రీసెర్చ్ చేసి “తవాస్మి” అనే పుస్తకాన్ని సమాజానికి అందించారు . ఈ పుస్తకాన్ని నవంబర్ 2020లో అప్పటి ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా శ్రీ వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఆ తర్వా త మనస్వి ,తపస్వి, వైదేహి అనే పుస్తకాలను కూడా మనకు అందించారు . ప్రపంచంలో నలుమూ లల ఈ పుస్తకాలు 50,000 పైగా పాఠకులకు చేరి వారు ఆదరాభిమానలను పొందాయి అని శ్రీ సరస్వతీ విద్యా మందిరం పాఠశాల ఇన్చార్జ్ బి.సరిత అన్నారు.

## పులివెందుల మెడికల్ కళాశాల ను వెంటనే ప్రారంభించాలి

### కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేట్ పరం చేయాలని నిర్ణయించడం గర్హనీయం

### డాక్టర్ ఎన్ తులసిరెడ్డి, మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి.

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాల పూర్తి అయి సంవత్సరం దాటినా ప్రారంభించక పోవడం గర్హనీయం అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి,పులివెందుల అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త మూలంరెడ్డి ధ్రువ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పులివెందుల మండలాధ్య క్షులు తుమ్మలూరు అనిల్ కుమార్ రెడ్డి అధ్వర్యం లో కాంగ్రెస్ నాయకులు పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భం గా తులసి రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రు 670 కోట్లు ఖర్చు చేసి పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాల ను సర్వాంగ సుందరంగా నిర్మించారన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి నేషనల్ మెడికల్ కమీషన్ 16-8-2024 న 50 యంబిబిఎస్ సీట్లు మంజూరు చేసింది అన్నారు మౌలిక సదుపాయాలు లేవని,సిబ్బంది కొరత వుందనీ సాకులు చూపి మంజూరు చేసిన ఎం బి బి ఎస్ సీట్లను వద్దని చంద్ర బాబు ప్రభుత్వం 10-9-24 న నేషనల్ మెడికల్ కమీషన్ కు లేఖ వ్రాసింది అన్నారు. ఇదిదురదృష్టకరం అన్నారు. కూటమి ప్రభుత్వ అసమర్ధతకు నిదర్శనం ఇదే అన్నారు. అన్ని రాష్ట్రాలు అడిగి ఎం బి బి ఎస్ సీట్లు తెచ్చుకుంటూ వుంటే చంద్రబాబు ప్రభుత్వం మంజూరైన సీట్లు వద్దనడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అసమర్థత కారణంగా ఆంధ్ర ప్రదేశ్ 2024-25 లో 700 ఎం బి బి ఎస్ సీట్లను,2025-26 లో మరో 700 ఎంబీబీఎస్. సీట్లను కోల్పోయింది అన్నారు. పులివెందుల, ఆదోని,మదనపల్లి, మార్కాపురం, పార్వతీపురం, అమలాపురం, బాపట్ల,నర్సీపట్నం,పెనుకొండ,పాలకొల్లు ప్రభుత్వ వైద్య కళాశాలల ను ప్రైవేట్ పరం చేయాలని , కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చంద్ర బాబు ప్రభుత్వం నిర్ణయించడం శోచనీయం అని ధ్వజమెత్తారు. దీనివలన ప్రతిభావంతులైన పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారు అన్నారు. ప్రతిభకు పాడె కట్టడమేఈ చర్య ఎన్టీఆర్ ఆశయాలకు విరుద్ధం వైద్య విద్యను ప్రైవేట్ పరం చేయవద్దని ,పులివెందుల మెడికల్ కళాశాల ను ప్రభుత్వ రంగం లోనే నడపాలని, ఈ విద్యా సంవ త్సరంలోనే కళాశాల ను ప్రారంభించాలని తులసి రెడ్డి, ధ్రువ కుమార్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశా రు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనంద్ రెడ్డి,శంకర్ రెడ్డి,వినోద్ కుమార్ రెడ్డి, దీక్షిత్, ఓబు లేసు యాదవ్,నూర్ బాషా,నాగరాజు, వెంగళ్ రెడ్డి,సుబ్రమణ్యం, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, వెంకటే ష్,రామాంజ నేయ రెడ్డి,మహబూబ్ బాషా, బద్రి, నాగ రాజు, రమణ, వినయ్,సాయి, తదితరులు పాల్గొన్నారు.

## సాయినాధునికి ప్రత్యేక పూజలు

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల పట్టణంలోనిపార్నపల్లి రోడ్డు సమీపం లో కొలువై ఉన్న మొట్టమొదటి షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమం నిర్వహించా రు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉదయాస్తమాన స్వామివారికి ఆలయ అర్చకులు మురళి స్వామి పంచామృత అభిషేకం సహస్రనామార్చన ప్రత్యేక అలంకరణ మంగళహారతులు తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమి చ్చారు. అనంతరం ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బ య్య మాట్లాడుతూ ఎంతో పురాతనమైన ప్రసిద్ధి గాంచిన పులివెందులలో మొట్ట మొదట కొలువై ఉన్న శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో ప్రతి గురువారం భక్తుల సహాయ సహకారాలతో పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, స్వామివారిపై ఎంతో నమ్మకము తో ఆలయానికి వచ్చి భక్తులు తమ ముక్కులు చెల్లించుకుని పూజలు నిర్వహించడం జరుగుతోం దని తెలియజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కార్డుదారులకు రేషన్ బియ్యం అందజేయాలి

### - తహసీల్దార్ హరినాథ్ రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



తెల్ల రేషన్ కార్డులు ఉన్న వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం అందజేసే రేషన్ బియ్యాన్ని డీలర్లు సరఫరా చేయాలని తహసీల్దార్ హరినాథ్ రెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక పట్టణంలోని రేషన్ షాపులను తహసీల్దార్ హరినాథ్ రెడ్డి తనిఖీలు చేపట్టారు. అలాగే బియ్యం స్టాక్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసే నిత్యావసర సరుకులను ప్రతి కార్డు దారునికి సకాలంలో అందజేసి డీలర్లు ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. బియ్యం పంపిణీలో అక్రమణలకు పాల్పడితే అలాంటి డీలర్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. తూకల్లో కూడ మోసం చేయకుండా ప్రజలకు బియ్యం పంపిణీ చేయాలని కోరారు. బియ్యం నిల్వ ఉన్న డీలర్లు అందరూ బియ్యం పూర్తిగా అయి పోయే వరకు పంపిణీ చేయాలని చెప్పారు. ఈయన వెంట ఆర్ఐ లోకేష్, విఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## గండి క్షేత్రం ఓవర్ హెడ్ ట్యాంక్ కీ నిధులు మంజూరు

### - పాలక మండలి చైర్మన్ కావలి క్రిష్ణతేజ

### - ఎంపీ అవినాష్ రెడ్డి కృషి ఎనలేనిది

ప్రజాభూమి, చక్రాయపేట



పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు గండి దేవస్థానం ఆలయ పాలక మండలి చైర్మన్ కావలి క్రిష్ణతేజ అన్నారు. ఈనెల 1న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కి ఈ విషయంపై వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఆయన సూచనల మేరకు జడ్పీ ఛైర్మన్ రామగోవింద్ రెడ్డి, చక్రాయపేట జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాద్ రెడ్డి, వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవి కుమార్ రెడ్డి లకు కూడా వినతిపత్రం అందజేశామన్నారు. జిల్లా



సర్వసభ్య సమావేశంలో గండి క్షేత్రానికి ఒక లక్ష లీటర్ల కెపాసిటీ కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని వారు ప్రస్తావించారని, ఆలయ ప్రాశస్త్యం దృష్ట్యా జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జడ్పీ సిఇఓ ఓబులమ్మ, జడ్పీ ఛైర్మన్ లు నిధులు మంజూరు చేశారన్నారు. అడిగిన వెంటనే స్పందించిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కృషి ఎనలేనిదన్నారు. అలాగే ప్రజా ప్రతినిధులకు, దేవస్థాన అధికారులు, పాలక మండలి సభ్యులకు కావలి క్రిష్ణతేజ ధన్యవాదాలు తెలిపారు.

## గుజ్జులవారి వివాహమ మహోత్సవం లో పాల్గొన్న మాజి ఎమ్మెల్యే అన్నా

ప్రజాభూమి మార్కాపురం



మార్కాపురం పొదిలి మండలం వేలూరు గ్రామంలో గుజ్జుల గిరిబాబురెడ్డి, రమాదేవిల కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరు అయి నూతన వధూవరులు అయిన నందిని, స్వరూప్ రెడ్డిను ఆశీర్వదించిన గిద్దలూరు మాజి శాసన సభ్యులు మార్కాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ సమనవ్యయకర్త అన్నా రాంబాబు తదితర నాయకులు పాల్గొన్నారు

## సి బి ఎస్ ఈ10వ తరగతిలో కమలా విద్యార్థుల విజయ పరంపర

ప్రజాభూమి మార్కాపురం



మార్కాపురం పదవ తరగతి పరీక్షల్లో స్థానిక కమలా హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించి సత్తా చాటారు. ఏడుగురు విద్యార్థులు 90% మార్కులకు పైగా సాధించి ప్రతిభను కనపరిచారు. గత మార్చి నెలలో జరిగిన బి బి ఎస్ సి10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 37 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై 100% ఉత్తీర్ణత సాధించారు. అత్యుత్తమ ఫలితాలను సాధించిన మా విద్యార్థులు జి. ఆశ్రిత రెడ్డి 95.2% మార్కులు సాధించి పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచింది. అదే విధంగా వి. మనస్విని 95% , కె. ఇంద్రనీల్ 94.8% జె.అంజన మేధ శ్రీ 94.4% , వి. జాహ్నవి 92.2% ఎ. అభిజిత్ కుమార్ 91.2% ఎస్. జస్వంత్ 90.8% మార్కులు సాధించారు. పాఠశాల యాజమాన్యం మరియు పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పవన్ కుమార్ అకడమిక్ డైరక్టర్ పి.సిందుజ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరూప్ రంజన్, టీచర్స్ బృందం విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.

## జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణీ

ప్రజాభూమి మార్కాపురం



మార్కాపురం జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయం నందు జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కిట్ల పంపిణీ కార్యక్రమం జనసేన పార్టీ వ రా ా ్క వ ్ ) ం % శ్ % నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్ ఆధ్వర్యంలో చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వీరమహిళలు మరియు జనసేన క్రియాశీలక వాలంటీర్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## స్టేట్ హజ్ హౌస్ కమిటీ కార్యాలయం లో బోర్డు మీటింగ్

### హాజరైన స్టేట్ హజ్ కమిటీ డైరెక్టర్ షేక్. మహబూబ్ భాషా

ప్రజాభూమి, పులివెందుల



హజ్ కమిటీ చెర్మెన్ హస్సన్ భాషా అధ్యక్షతన నిర్వహించిన బోర్డు మీటింగ్ కు ఏపీ లోని అన్ని జిల్లాల డైరెక్టర్లు గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా హజ్ కమిటీ డైరెక్టర్లు అందరు కలిసి కమిటీసభ్యులందరు మొదటి సారిగా దిగిన చిత్ర పటాన్ని చెర్మెన్ హస్సన్ భాషా కు బహుకరించా రు.ఈ నెల 18 వ తేదీ ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుండి హజ్ యాత్రలకు వెళ్లే యత్రికుల ప్రయాణ సౌకర్యాలు, భోజన సదుపాయలు గురించి చర్చిం చారు.హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులను విజయవాడ లోని తుమ్మలపల్లె కళాక్షేత్రం లో వసతులను సమకూర్చినట్లు వారు తెలిపారు. కళా క్షేత్రం నుండి హైదరాబాద్ ఎయిర్పోర్ట్ కు వెళ్లి అక్కడి నుండి మక్కా మదీనాకు చేరే అన్ని సౌకర్యలను ఏర్పాటు చేయడం జరిగింది అని వారు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నారని చైర్మెన్ హాసన్ భాషా మీటింగ్ లో కమిటీ సభ్యులకు తెలిపారు.కార్యక్రమంలో ఏపీ స్టేట్ హజ్ కమిటీ మెంబర్లు, ఈఓ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మోహన్ బాబు విశ్వవిద్యాలయం -పెన్ స్టేట్ యూనివర్సిటీ మధ్య పరస్పర అవగాహన ఒప్పందం ..!

ప్రజాభూమి ,చంద్రగిరి:



చంద్రగిరి మండలం,ఎ.రంగంపేట సమీపంలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయం, అమెరికాలోని పెన్ స్టట్ యూనివర్సిటీ మధ్య పరస్పర అవగాహన ఒప్పంద కార్యకమ్రం నిర్వహించారు. మోహన్ బాబువిశ్వ విద్యాలయంలోని దాసరి ఆడిటోరియంలో ఈ ఒప్పంద పత్రాలపై ఇరు విశ్వవిద్యాలయాల అధికారులు సంతకాలు చేశారు. భారత దేశంలో ఇలాంటి అమెరికా విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం చేసుకోవటం చారిత్రాత్మకంఅని ప్రోఛాన్సలర్ మంచు విష్ణు అన్నారు.ఈ పరస్పరవ ఒప్పందం సాంకేతికత మార్పిడికి దోహద పడగలదన్న పెన్ స్టేట్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డాక్టర్ డేవిడ్ ఎం కల్లజో ఫెరేజ్ తెలిపారు.ఈ పరస్పర ఒప్పందం వల్ల విద్యార్థులకు పలు ఉత్తమ అవకాశాలు కల్పించడంలో రెండు విశ్వవిద్యాలయం అధికారులు తెలిపారు.ఈ ఒప్పందం నూతన ఆవిష్కరణలకు పరిశోధనలకు నాందిపలక గలవని భావన అన్నారు.పలువురికి ఈ ఒప్పందం ద్వారా ఉత్తమ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపినవిశ్వవిద్యాలయాల అధికారులు.ఈ పరస్పర ఒప్పందం వలన కలిగే పలు ప్రయోజనాలను వివరించిన యంబియు ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు ,పెన్ స్టేట్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వాహిద్ మోటేవల్లి తదితరులు తెలిపారు.

## సహకార బ్యాంక్ చైర్మన్‌కు ఘన సన్మానం

ప్రజాభూమి,తిరుపతి



చిత్తూరు జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ గా నియమితులైన అమాస రాజశేఖర్ రెడ్డిని బిజెపి సీనియర్ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అమాస రాజశేఖర్ రెడ్డి స్వగృహానికి చేరుకున్న బిజెపి నాయకులు ఆయనను దుస్సలవతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సహకార బ్యాంక్ చైర్మన్ గా పని చేసిన ఆమాస రాజశేఖర్ రెడ్డి సహకార బ్యాంకుల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం మరోసారి ఆయనకు అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో. బిజెపి జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్ తెలుగుదేశం సీనియర్ నాయకులు సింగంశెట్టి సుబ్బరామయ్య బిజెపి నాయకులు మల్లారపు రవి ప్రసాద్ తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి పురోహితుడు సురేష్ స్వామి తెలుగుదేశం నాయకులు సురేంద్ర రాజు విద్వాన్ కస్పా పద్మనాభన్ దేపూరు నగేష్ జనసేన నాయకులు మనీ రాయల్ పోకల జనార్ధన్ పాల్గొన్నారు.

## తిరుమలలో భద్రతపై ఉన్నతస్థాయి సమీక్ష

ప్రజా భూమి, తిరుమల

తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో గురువారం తిరుమల భద్రతపై ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పోలీసు శాఖ, టీటీడీ, ఇతర భద్రతా విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతపురం రేంజ్ డీఐజీ డా.షెమూషి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ, ఇటీవల పహల్గాం ఉగ్ర దాడి ఘటన నేపథ్యంలో తిరుమల ఆలయంలో భద్రతను మరింత బలోపేతం చేయడమే భద్రతా ఆడిట్ ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. అన్ని భద్రతా దళాలు మరియు టీటీడీ విభాగాల సమన్వయంతో పనిచేస్తూ, భక్తుల మనోభావాలను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు.అంతకు ముందు టీటీడీ ఇన్‌ఛార్జి సీవీఎస్వో మరియు తిరుపతి అర్బన్ ఎస్పీ శ్రీ హర్షవర్ధన్ రాజు 2023 మే నెలలో నిర్వహించిన భద్రతా ఆడిట్ సమీక్షలో చేసిన ప్రతిపాదనలు, అలాగే ఇటీవల ఏర్పడిన పరిస్థితుల ఆధారంగా చేపట్టాల్సిన మార్పులు అనే విషయాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సుదీర్ఘ%శీ%గా వివరించారు.అలాగే, ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హోం గార్డులు, సివిల్ పోలీసు, టీటీడీ భద్రతా సిబ్బంది వంటి అన్ని భద్రతా దళాలను సమన్వయ పరచి ప్రతి ఒక్క దళానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సహా అన్ని యాక్సెస్ కంట్రోల్ బృందాలకు తగిన శిక్షణ



ఇవ్వాల్సిన అవసరముందని అన్నారు.తలకోన, మామండూరు, తుంబురు తీర్థం, మంగళం మార్గాలు సహా శేషాచల అటవీ ప్రాంతానికి చెందిన 14 ప్రవేశ ద్వారాలలో భద్రతను మరింత పటిష్టం చేయాలని సూచించారు.అలాగే, భద్రతా సిబ్బందికి రసాయన, జీవ, కిరణ, అణు ముప్పులపై శిక్షణ యాంటీ సాబటేజ్ చర్యలు, మాక్ డ్రిల్లులు, ఎవాక్యుయేషన్ డ్రిల్లులు వంటి అంశాలపై శిక్షణలు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సమావేశంలో గ్రేహౌండ్స్ (కమాండర్) ఎస్పీ డా. గరుడ్ సుమిత్ సునీల్, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ అరిఫ్ హఫీజ్, తిరుపతి డీఎఫ్ఓ వివేక్ ఆనంద్, వివిధ భద్రతా దళ అధికారులు, టీటీడీ విజిలెన్స్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## జిల్లా లోని పర్యాటక ప్రదేశాలలో పర్యాటకులకు అవసరమైన వసతుల ఏర్పాటు పై దృష్టి పెట్టండి

### టెంపుల్ టూరిజం నకు చర్యలు చేపట్టండి జిల్లా కలెక్టర్

ప్రజాభుమి ప్రతినిధి,చిత్తూరు:

చిత్తూరు జిల్లా లో గల పర్యాటక ప్రదేశాలలో పర్యాటకులకు అవసరమైన వసతుల ఏర్పాటు పై పర్యాటక శాఖ అధికారులు దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లాసచివాలయం లోని సమావేశపు మందిరం నందు జిల్లా పర్యాటక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారితో చర్చించి పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు.ప్రస్తుతం ఉన్న పర్యాటక ప్రదేశాలలో పర్యాటకులకు అవసరమైన సదుపాయాలలో భాగంగా వసతి,షాపింగ్ కాంప్లెక్స్, టాయిలెట్స్, ఇతరత్రా సౌకర్యాల ఏర్పాటు పై దృష్టి పెట్టాలన్నారు.ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఒక మాసం లోపు సిద్ధం చేయాలని పర్యాటకశాఖ అధికారులను ఆదేశించారు.

మొగిలి దేవస్థానం ఆలయం అభివృద్ధికి చర్యలు చేపట్టడం లో భాగంగా ఇందుకు అవసరమైన డిపిఆర్ లను సిద్ధం చేయాలన్నారు.కుప్పంలో ననియాల ఎకో టూరిజం,కంగుంది, పాలారు రివర్ ప్రాంతాలలో అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారుకాణిపాకం, బోయకొండ దేవస్థానాలలో పర్యాటక రంగం అభివృద్ధికి



గాను ప్రసాదం స్కీం కింద అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు.జిల్లాలో రానున్న కాలంలో పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన భూమి కేటాయింపులకు సంబంధించి పర్యాటక శాఖ రెవెన్యూ శాఖ సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు.అటవీ శాఖ కు అనుసంధానం గా ఉన్న ప్రాంతాలలో ఎకో టూరిజం అభివృద్ధికి అటవీ శాఖ అధికారులతో సమ న్వయం చేసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో డిఎఫ్ఓ భరణి,పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్,పిఆర్ ఎస్ ఈ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి గౌరీ,జిల్లా దేవాదాయశాఖ అధికారి చిట్టెమ్మ, చిత్తూరు ఆర్ డి ఓ శ్రీనివాసులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య నివారణకు చర్యలు- బిటెక్ రవి కృషితో రూ.1.5 కోట్ల నిధులు

### - తాగునీటి, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

### - టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె

తాగునీటి సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పాపాగ్ని నదిలో తాగు నీటి ఫిల్టర్ ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇంచార్జీ బిటెక్ రవి కృషి ద్వారా తాగునీటి సమస్యని అధిగమించేందుకు కలెక్టర్ తో రూ.1.5 కోట్లు నిధులు విడుదల చేయించారన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో కొత్త బోర్లు, ఫిల్టర్లు వేయించినట్లు తెలిపారు. దీంతో పాటు త్వరలోనే పిబిసి నుంచి పాపాగ్ని నదికి నీటిని పారుదల చేస్తామన్నారు. రానున్న కాలంలో తాగునీటి సమస్య లేకుండా బిటెక్ రవి కృషి చేస్తున్నారన్నారు. అలాగే కొత్త ఇఓ ని నియమించామని, పంచాయతీ పరిధిలోని పారిశుధ్యం ఇతరత్రా సమస్యలు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి




మండల కన్వీనర్ రామముని రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర, మైనారిటీ కన్వీనర్ తెలంగాణ వలి, నాయకులు వేమాకుమార్, మహమ్మద్, దక్కారమేష్, మడక శ్రీను, పీరాసాహెబ్, జబిబుల్లా, ఫయాజ్, యాసిన్, రాహుల్, జనసేన పార్టీ నాయకులు దాసరి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గాలి వాన ఉరుముల మెరుపులతో వర్షం భయభ్రాంతులకు లోనైన ప్రజలు విద్యుత్ అస్థవ్యస్థం



ప్రజా భూమి ముద్దనూరు

మండల పరిధిలోని గ్రామాలలో రాత్రి కురిసిన గాలి వాన కుమ్ముల మెరుపులతో దాదాపు అన్ని సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ వ్యవస్థ అ న్త వ్య న్త వు ం ౦ ు ం ది. ఉరుముల మెరుపుల శబ్దాలతో ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారు. అర్ధరాత్రి దాటిన నుండి గాలివాన కొంతమేర సద్దుమనగడంతో విద్యుత్ అధికారులు యుద్ధప్రాతి పధిక పైన పనులు చేపట్టారు. తక్కువ సమస్య ఉన్న ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేస్తూ మేజర్ సమస్యలు గ్రామాలలో విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు విస్తృతంగా కృషి చేశారు. రాత్రి కురిసిన గాలివానకు మండలంలోని నాలుగు సబ్ స్టేషన్ పరిధిలో తీవ్ర నష్టం జరిగింద ని జై శ్రీనివాస రాజ వర్మ తెలిపారు. కోనాపురంలో 4, విద్యుత్ స్తంభాలు మోసం వారి పల్లి పరిధిలో ఎల్టి లైన్ కు సంబంధించిన విద్యుత్ స్తంభాలు నాలుగు. అలాగే ఆర్జీపల్లి గ్రామా సమీపాన 11 కెవి విద్యుత్ స్తంభాలు ఆరు కూలిపోయాయని తెలిపారు. అలాగే ముద్దనూరు సబ్టేషన్ పరిధిలో నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు తెలిపారు. ఉప్పలూరు ప్రాంతంలో ఉన్న గ్రామాలకు విద్యుత్తు అంతరాయం ఎక్కువ కలిగిందని మా సిబ్బంది వాడిని సరిచేస్తున్నారని రాత్రి 11 గంటలలోపు అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా అయ్యేటట్లు చూస్తామని ఏఈ శ్రీనివాస రాజా శర్మ పేర్కొన్నారు



## జిల్లాలో వేసవి కాలంలో విజ్ఞానంతో పాటు 50 క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నాం...

### జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాయుడు

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం

వేసవి కాలంలో విజ్ఞానం తో పాటు క్రీడల పట్ల ఆసక్తి కలిగించే కార్యక్రమాలు చేపట్టడంలో భాగంగా మే 1 నుంచి మే 30 వరకు వివిధ క్రీడంసాల్లో 50 క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు పేర్కొన్నారు.

గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో క్రీడా శిక్షకులకు కిట్లు అందచేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, జిల్లా క్రీడా సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో వివిధ క్రీడా అంశాల్లో 50 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా క్రీడల్లో ప్రతిభను మెరుగు పరుచుకోవాలన్నారు. శిక్షకులకు రూ.5,వేలు విలువ చేసే క్రీడా సామగ్రి , గౌరవ వేతనం రూ.15వందల రూపాయలతో , ఇతర ఖర్చుల కోసం 5 వందల రూపాయలు అదనపు ఖర్చును వారికి అందజేయడం జరిగిందన్నారు. క్రీడల్లో మెలుకువలు నేర్పుతూ వారి యొక్క భద్రత మరియు ఇతర సదుపాయాలు కల్పించే విధంగా క్యాంపు నిర్వహించాలని తెలియజేశారు. తూర్పు గోదావరి జిల్లాలో 15 క్రీడా అంశాలలో మొత్తం 50 క్యాంపులు



నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా సాధికారిత అధికారి డి ఎమ్ ఎమ్ శేషగిరి తెలిపారు. క్రీడల నిర్వహణ కోసం అథ్లెటిక్స్ 2, బాల్ బ్యాట్మెంటన్ 2, బాస్కెట్ బాల్ 8, బాక్సింగ్ 4, చెస్ 1, క్రికెట్ 3, ఫుట్బాల్ 5, హ్యాండ్ బాల్ 2, జూడో 3, కరాటే 3, కబడ్డీ 3, టైక్వాండో 3, వాలీబాల్ 6, వెయిట్ లిఫ్టింగ్ 1, యోగ 4 కిట్ లు అందచేశామన్నారు.

Printed and Published and owned by A.RAMAMOHANREDDY, Printed at Mohaneeswar Publications, D.No.30-251,WARDNO.4,BUDDAYAPALLY VILLAGE, CHINNACHOWK, YSRDISTRICT-516002, ANDHRAPRADESH.and Published from D.No.30-251,WARDNO.4,BUDDAYAPALLY VILLAGE, CHINNACHOWK, YSRDISTRICT-516002, ANDHRAPRADESH Editor :A.RAMAMOHANREDDY,CELL: 9502116677